Follow: @ANNTELUGU
19-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 142 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



### కేరళ సీఎంగా వీడీ సతీషన్
## ప్రమాణస్వీకారం
### హాజరైన ఖర్గే, రాహుల్ , ప్రియాంక, రేవంత్ రెడ్డి
ప్రత్యేక ఆకర్షణగా విజయన్.. కాంగ్రెస్ పాలిత సీఎంలతో వేదిక కళ

**తిరువనంతపురం:** కేరళ ముఖ్యమంత్రి గా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 20మంది మంత్రులు ప్రమాణం చేశారు. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పాలిత సీఎంలతో వేదిక కళకళలాడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇందులో ప్రత్యేక ఆకర్షణగా మారారు. ఓటమి పాలైన విజయన్ సతీషన్ ఆహ్వానంతో కార్యక్రమానికి రావడం ఆకట్టుకుంది.

**టాప్ న్యూస్**

### రోడ్లపై నమాజ్‌లు వద్దు
- ముస్లింలు జనాభా నియంత్రించుకోవాలి
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



02

### ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సీఎం అయ్యారు
- విజయ్‌పై స్టాలిన్ సెటైర్లు



02

### విజయ్‌కి మద్దతిచ్చాక కూడా..
- నాకు సీఎం పదవి ఆఫర్ చేశారు
- నన్ను సీఎం, పళనిస్వామిని డిప్యూటీ సీఎం చేయాలన్నారు
- వీసీకే చీఫ్ తిరుమావళవన్ సంచలన వ్యాఖ్యలు



02

### నక్సల్స్ రహిత రాష్ట్రంగా
## తెలంగాణ
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు
- తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు సన్మానం



**జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), మహా :** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చతిస్గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు.

మిగతా 2లో



### అమెరికాకు
## భారత్ షాక్
- రష్యా నుండి చమురు కొంటాం
- ఏం చేసుకుంటారో చేస్కోండని అల్టిమేటం

02

# ప్లేఆఫ్‌కు హైదరాబాద్

### హోం గ్రౌండ్‌లో చెన్నైను చిత్తుచేసిన సన్ రైజర్స్
ఇషాన్ సూపర్ బ్యాటింగ్.. సాంబార్ పై బిర్యానీ విక్టరీ అంటూ అభిమానుల హర్షం

ఇప్పటికే ప్లే ఆఫ్ కు ఆర్ సీబీ.. హైదరాబాద్ విజయంతో.. గుజరాత్ కూడా ప్లే ఆఫ్ ఖరారు



**మహా నెట్ వర్క్,**

హోంగ్రౌండ్ లో చెన్నైను హైదరాబాద్ సన్ రైజర్స్ చితకొట్టింది. చిత్తుచిత్తు చేసింది. నేరుగా ప్లే ఆఫ్ లో బెర్త్ ఖరారుచేసుకుంది. ఐపీఎల్ సీజన్ లో హాట్ ఫేవరేట్ గా మరోసారి సత్తాచాటింది. చెన్నై ఇచ్చిన 181 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ 4 వికెట్ల నష్టానికే ఛేజ్ చేసేసింది. ఈ మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్ ఇషాన్ కిషన్ సూపర్ ఇన్నింగ్స్‌తో దుమ్మురేపాడు. వీరిద్దరూ ఊపిన ఊపుకు ఆరెంజ్ ఆర్మీ విజయం ఖరారయింది. ఆఖరి వరకు పోరాడిన ఇషాన్ కిషన్ ఆఖర్లో క్యాచ్ అవుటయ్యాడు. కానీ అప్పటికే మ్యాచ్ ఆరెంజ్ ఆర్మీ హైదరాబాద్ సొంతమైపోయింది. ఇషాన్ కిషన్(70), క్లాసేన్(47), అభిషేక్ శర్మ(26) పరుగులతో రాణించారు. ఈ విజయంతో హైదరాబాద్ సన్ రైజర్స్ ప్లేఆఫ్‌కు అర్హత సాధించగా.. చెన్నై కూడా ప్లేఆఫ్‌కు చేరాలి అంటే ఇతర జట్ల పర్ఫార్మెన్స్ పై ఆధార పడాలి. చెన్నైపై సూపర్ విక్టరీ సాధించిన సన్ రైజర్స్ ను సాంబార్ పై బిర్యానీ విక్టరీ, కాటేరమ్మ కొడుకుల హవా అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ప్లే ఆఫ్ చేరేది వీరే...
ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (18) టాప్‌లో ఉంది. మరొక మ్యాచ్ మిగిలిఉండగానే ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. చివరి పోరులోనూ గెలిస్తే టాప్ 2లో స్థానం ఖాయం. ఆ తర్వాత 13 మ్యాచుల్లో ఎనిమిది విజయాలతో గుజరాత్ టైటాన్స్ (16) సెకండ్ ప్లేస్‌లో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ చెన్నైపై విజయంతో (16 పాయింట్లు)తో అదే స్థాయికి చేరుకుంది. దీంతో ప్లే ఆఫ్ కు బెంగుళూరు, హైదరాబాద్, గుజరాత్ ఫైనల్ అయినట్లే. , పంజాబ్ కింగ్స్ (13 పాయింట్లు), రాజస్థాన్ రాయల్స్ (12), సీఎస్‌కే (12), ఢిల్లీ (12), కోల్‌కతా (11) తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో ఆ ఒక్క జట్టేంటో చూడాలి.

### ఈ రెండు జట్లే డేంజర్
నాకౌట్ రేసు నుంచి ఎప్పుడో నిష్క్రమించిన ముంబయి, లక్నోతో ఇప్పుడు ప్రత్యర్థుల రాతమారనుంది. ఇరు జట్లూ రెండేసి మ్యాచులు ఆడాల్సి ఉంది. రాజస్థాన్ భవితవ్యం ఇప్పుడు ఈ రెండు టీమ్‌ల పైనే ఆధారపడి ఉంది. ఒక్క మ్యాచ్ ఓడినా రాజస్థాన్ ఇంటికే. ఇటు పంజాబ్ ఫ్యూచర్ లక్నో చేతిలో ఉంది. తన చివరి మ్యాచ్‌ను ఆ జట్టుతో తలపడాల్సి ఉంది.



## సన్నాలకు ఫుల్ డిమాండ్
### 20 లక్షల టన్నుల ధాన్యం నేరుగా కొనుగోలు
తుంగభద్ర క్రాప్ హాలిడే ఎఫెక్ట్.. కర్ణాటకలో 18 లక్షల టన్నుల కొరత
సరిహద్దు జిల్లాల నుంచి 5 లక్షల టన్నుల ఎగుమతి
ఏపీ, తమిళనాడుకు 4.5 లక్షల టన్నులు.. మహారాష్ట్ర, కర్ణాటకకు 2 లక్షల టన్నులు
7,143 కొనుగోలు కేంద్రాలున్న దళారులదే హవా

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రైతన్న పండించిన యాసంగి సన్న ధాన్యానికి దేశవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల్లో అనూహ్యమైన, మునుపెన్నడూ లేని స్థాయిలో డిమాండ్ ఏర్పడింది. ఒకవైపు ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యం సేకరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ భారీ లక్ష్యాలను నిర్దేశించుకోగా, క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం ప్రభుత్వ అంచనాలను పూర్తిగా తలకిందులు చేస్తున్నాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి బడా వ్యాపారులు, దళారులు వందలాది లారీలతో రాష్ట్రంలోకి ప్రవేశించారు. మార్కెట్ వర్గాల ప్రాథమిక గణాంకాల ప్రకారం సుమారు 15 నుంచి 20 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని ఈ వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దే కొనుగోలు చేసి రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ భారీ వలసల కారణంగా రాష్ట్ర ప్రభుత్వ కొనుగోళ్లు కనీసం 75 లక్షల టన్నుల మార్కును చేరుకోవడం కూడా కష్టమేననే ఆందోళన వ్యక్తమవుతోంది. దళారుల ప్రవేశం, కర్ణాటకలో 18 లక్షల టన్నుల కొరత, ఏపీకి 4.5 లక్షల టన్నుల తరలింపు, మహారాష్ట్రకు మరో 2 లక్షల టన్నుల ఎగుమతి.. ఇవన్నీ తెలంగాణ వరి కొనుగోళ్ల ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి.

**తుంగభద్ర క్రాప్ హాలిడే ఎఫెక్ట్..**
**కర్ణాటకలో తీవ్ర ధాన్యం కొరత**

సరిహద్దులు దాటుతున్న ఈ సన్నాల

మిగతా 2లో

## యుద్ధం పరిష్కారం కాదు
ఉగ్రవాదంపై పోరులో నిజమైన స్నేహాన్ని చాటిన నార్వే
ప్రధాని మోదీ ప్రశంసలు.. మోదీకి నార్వే అత్యున్నత పురస్కారం



02




### మ్యూజియాలు జీవన విధానానికి
## అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు
భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద మ్యూజియం
అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి



**హైదరాబాద్, మహా :** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి

మిగతా 2లో

### కేబీఆర్ పార్క్ పరిసరాల్లో
## చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే
### ఎస్ఆర్ డీపీ పనులకు తాత్కాలిక బ్రేక్
చెట్లను నరకడంతో సైరంది కాదంటున్న పర్యావరణం ప్రేమికులు
కౌంటర్ దాఖలుకు సన్నద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని ప్రముఖ కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) జాతీయ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఉన్న చెట్లను నరకవద్దని ఆదేశిస్తూ న్యాయస్థానం స్టే విధించింది. ముఖ్యంగా కేబీఆర్ పార్క్ సమీపంలో 35 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ టచ్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణాన్ని చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్ డీపీ) కింద పనులు ప్రారంభించింది. అయితే, ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి, పార్కులోని జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. సుప్రీంకోర్టు తాజాగా విధించిన స్టేతో కేబీఆర్ పార్క్ జంక్షన్ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్‌ఆర్‌డీపీ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. పర్యావరణ పరిరక్షణను

మిగతా 2లో

# సన్నాలకు ఫుల్ డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

వెల్లువకు ప్రధాన కారణం కర్ణాటక రాష్ట్రంలోని పరిస్థితులే. ఆ రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న తుంగభద్ర డ్యామ్ 33వ గేటుకు భారీ మరమ్మతులు జరుగుతుండటం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. నీటి కొరత కారణంగా కర్ణాటకలోని 'రైస్ బౌల్'గా పిలిచే రాయచూర్, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల్లో ప్రభుత్వం ఈ సీజన్‌కు 'క్రాప్ హాలిడే' (పంట విరామం) ప్రకటించింది. వాస్తవానికి ఈ నాలుగు జిల్లాల్లో కలిపి దాదాపు 6 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ప్రతి సీజన్‌లో ఇక్కడి నుంచి 18 లక్షల మెట్రిక్ టన్నుల అత్యుత్తమ నాణ్యత గల సన్న ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ఐటీ కారిడార్ బెంగళూరుతో సహా కర్ణాటకలోని మెజారిటీ ప్రాంతాలకు ఇక్కడి నుంచే బియ్యం సరఫరా అవుతుంది. క్రాప్ హాలిడే కారణంగా ఈ 18 లక్షల టన్నుల భారీ లోటు ఏర్పడటంతో ఆ రాష్ట్ర వ్యాపారులు, రైస్ మిల్లర్లు దిక్కు తోచక పూర్తిగా తెలంగాణ యాసంగి పంటపైనే ఆధారపడ్డారు. ఈ గ్యాప్‌ను భర్తీ చేసుకునేందుకు కర్ణాటక వ్యాపారులు మూకుమ్మడిగా తెలంగాణ వ్యవసాయ క్షేత్రాలపై పడ్డారు.

**దక్షిణ తెలంగాణ నుంచి 5 లక్షల టన్నుల వలస**

కర్ణాటక వ్యాపారులు తమ రవాణా ఖర్చులను తగ్గించుకునేందుకు భౌగోళికంగా తమకు అత్యంత సమీపంలో ఉన్న దక్షిణ తెలంగాణ జిల్లాలను తమ కొనుగోలు కేంద్రాలుగా మార్చుకున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ పరిధిలోని జోగులాంబ గద్వాల, నారాయణ పేట, మరియు వికారాబాద్ జిల్లాల్లో ఈ యాసంగిలో సుమారు 10 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే, ఇందులో సగానికి పైగా, అంటే దాదాపు 5 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని కర్ణాటక వ్యాపారులు నేరుగా గ్రామాలకే వెళ్లి రైతుల కల్లాల వద్దే తూకాలు వేసుకుంటున్నారు. రవాణా భారం లేకపోవడం, చేతికి వెంటనే నగదు అందుతుండటంతో ఇక్కడి రైతులు కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే కర్ణాటక వ్యాపారులకే తమ పంటను విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు.

**బోధన్ కేంద్రంగా నాందేడ్, కర్ణాటకకు 2 లక్షల టన్నులు**

రాష్ట్రంలో వరి కోతలు అత్యంత ముందుగా ప్రారంభమయ్యే ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా పొరుగు రాష్ట్రాల వ్యాపారులకు అతిపెద్ద అడ్డాగా మారింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.5 లక్షల టన్నుల సన్న ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అధికారులు భావించారు. అయితే, ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో సన్నద్ధం కాకముందే, కేవలం బోధన్ నియోజకవర్గం మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే సుమారు 2 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని మహారాష్ట్ర (నాందేడ్, ధర్మాబాద్ ప్రాంతాలు), మరియు కర్ణాటక వ్యాపారులు పోటీ పడి మరీ కొనుగోలు చేసి తరలించారు. ఆరంభంలోనే సగానికి పైగా ప్రైవేట్ కొనుగోళ్లు జరిగిపోవడంతో అధికార యంత్రాంగం నివ్వెరపోవాల్సి వచ్చింది.

**ఏపీ, చెన్నై మార్కెట్లకు నల్గొండ, ఖమ్మం సన్నాలు**

మరోవైపు తెలంగాణ తూర్పు, దక్షిణ సరిహద్దుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు సైతం సన్నాల తరలింపు జోరుగా సాగుతోంది. ధాన్యాగారాలుగా పేరుగాంచిన ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి సుమారు 3 లక్షల టన్నులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సుమారు 1.5 లక్షల టన్నుల ధాన్యం ఏపీకి వెళుతున్నట్లు మార్కెట్ వర్గాల డేటా స్పష్టం చేస్తోంది. ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల మిల్లర్లతో పాటు, తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన బడా వ్యాపారులు స్థానిక కమీషన్ ఏజెంట్ల ద్వారా ఈ 4.5 లక్షల టన్నుల భారీ లావాదేవీలను తెరవెనుక నడిపిస్తున్నారు. దీనికి తోడు, ఆసియాలోనే అతిపెద్ద రైస్ మిల్లింగ్ హబ్‌గా ఉన్న మిర్యాలగూడలోని 150కి పైగా స్థానిక రైస్ మిల్లులు సైతం రోజుకు వేలాది టన్నుల సన్నాలను తమ గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నాయి. బయటి వ్యాపారులకు ధాన్యం దక్కకుండా వీరు కూడా నేరుగా రైతులకే వల వేస్తున్నారు.

**7,143 కొనుగోలు కేంద్రాలు.. అయినా దళారులదే హవా**

ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఇంత భారీ ఎత్తున చొరబడటంతో తెలంగాణ పౌర సరఫరాల శాఖ లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి 90 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఏకంగా 7,143 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ, పక్కా ప్రణాళికతో దళారులు వ్యవహరిస్తుండటం, దాదాపు 15 నుంచి 20 లక్షల టన్నుల సన్నాలు నేరుగా పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతుండటంతో, ప్రభుత్వ కేంద్రాలకు ధాన్యం రాక గణనీయంగా పడిపోయింది. క్షేత్రస్థాయిలో ఉన్న ఈ విపత్కర పరిస్థితులను గమనిస్తున్న వ్యవసాయ మార్కెట్ విశ్లేషకులు, ఈసారి ప్రభుత్వ కొనుగోళ్లు మహా అయితే 75 నుంచి 80 లక్షల టన్నులకే పరిమితం అయ్యే అవకాశం ఉందని కుండబద్దలు కొడుతున్నారు.

**రూ.2,703 పక్కా ధర ఉన్నా.. కల్లాల వద్ద రైతుల కన్నీరు**

సన్నాలు పండించిన రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రేడ్‌ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203 కనీస మద్దతు ధరను నిర్ణయించగా, రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని దానికి అదనంగా రూ.500 బోనస్ ఇస్తూ మొత్తం రూ.2,703 చెల్లిస్తోంది. ఇంత అద్భుతమైన, లాభదాయకమైన ధరను ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ.. కొనుగోలు కేంద్రాల వద్ద సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం రైతులను తీవ్రంగా బాధిస్తోంది. గన్నీ బ్యాగుల (గోనె సంచుల) కొరత, తేమ శాతం పేరిట కోతలు, తూకాల్లో విపరీతమైన జాప్యం వల్ల రైతులు రోజుల తరబడి రోడ్ల మీదే నిరీక్షించాల్సి వస్తోంది. ప్రస్తుతం సుమారు 15 వేల మందికి పైగా రైతులు వివిధ జిల్లాల్లోని కల్లాల వద్ద అకాల వర్షాలకు తడిసిన ధాన్యంతో పడిగాపులు కాస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సరిగ్గా ప్రభుత్వ వ్యవస్థలోని ఈ లోపాలనే ఆసరాగా చేసుకుని, తక్కువ సమయం, స్పాట్ క్యాష్ ఆఫర్లతో లక్షల టన్నుల అమూల్యమైన సన్న ధాన్యాన్ని తమ రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారు. వ్యవస్థాపరమైన లోపాలను సవరించకపోతే, ప్రభుత్వం అందిస్తున్న బోనస్ ప్రయోజనం అసలైన రైతుకు కాకుండా దళారుల జేబుల్లోకే వెళుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కల్ప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు మరియు మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ & గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ & మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాల పరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. "మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మ వారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది" అని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. నక్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు. ఒక జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమెరికాకు భారత్ షాక్

**మహా :** భారత్ తన ఇంధన భద్రతను స్పష్టం చేస్తూ.. అమెరికా ఆంక్షల మినహాయింపుతో సంబంధం లేకుండా రష్యా నుండి ముడి చమురును కొనుగోలు చేస్తామని ప్రకటించింది. రష్యా ముడి చమురు సేకరణకు అమెరికా మినహాయింపు పొడిగింపును భారత్ కోరిందని బ్లూమ్ బెర్గ్ నివేదించిన కొద్ది రోజులకే, ఈ కీలక ప్రకటనను పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో శర్మ మాట్లాడుతూ.. మినహాయింపు కాలానికి ముందే.. ఆ సమయంలో ఇప్పుడు కూడా భారత్ రష్యా నుండి చమురును సేకరిస్తోందని స్పష్టం చేశారు. రాయిటర్స్ ప్రకారం "రష్యాపై అమెరికన్ మినహాయింపుకు సంబంధించి, మేము గతంలో రష్యా నుండి కొనుగోలు చేస్తున్నామని నొక్కి చెప్పాలనుకుంటున్నాను. అంటే మినహాయింపుకు ముందు కూడా.. మినహాయింపు సమయంలో కూడా.. ఇప్పుడు కూడా" అని పేర్కొన్నారు.

# నాటి నుంచి నేటి వరకు మోదీ నిబద్ధత చెక్కు చెదరలేదు

## ఆయనతో నాటి అమెరికా పర్యటన ఓ మధురానుభూతి

వికసిత భారత్ నిర్మాణంలో నేనూ ఒక సమిధను కావడం గర్వకారణం

కాలం మారింది.. కానీ దేశం పట్ల ప్రధాని మోదీ దూరదృష్టి మారలేదు

భారతీయ జనతా పార్టీ జాతి నాయకులు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఇంచార్జ్ , మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



**హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 32వ అంతర్జాతీయ పురస్కారం దక్కిన వేళ, భారతీయ జనతా పార్టీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ అరుదైన గౌరవం ప్రధానికి దక్కిన సందర్భంగా దశాబ్దాల క్రితం ఆయనతో కలిసి చేసిన పర్యటన జ్ఞాపకాలను పొంగులేటి గుర్తు చేసుకున్నారు. 1993లో నరేంద్ర మోదీతో కలిసి ఒక ప్రతినిధి బృందంలో సభ్యుడిగా తాను అమెరికా పర్యటనలో పాల్గొన్నానని, ఆ రోజులు తన జీవితంలో అత్యంత గర్వకారణమైనవని ఆయన ఉద్వేగంగా వెల్లడించారు. ఆ రోజుకు, ఈ రోజుకు మధ్య కేవలం సమయం మాత్రమే మారిందని పొంగులేటి సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దేశం పట్ల నరేంద్ర మోదీకి ఉన్న అచంచలమైన నిబద్ధత, ఆయన ఆలోచనా విధానం, దూరదృష్టి ఏమాత్రం మారలేదని కొనియాడారు. మోదీ ఆశయాలు ఎప్పటికీ దారిచూపే ధ్రువనక్షత్రంలా వెలుగుతూనే ఉంటాయని, ఆ మహోన్నత వ్యక్తిత్వమే ఆయనకు ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత గౌరవాలు తెచ్చిపెడుతోందని ఆయన ప్రశంసించారు. నాడు తనతో కలిసి ప్రయాణించిన నాయకుడు, నేడు విశ్వ గురువుగా ఎదిగి వికసిత భారత్ కలను సాకారం చేసే దిశగా అడుగులు వేయడం ఒక విధేయుడైన కార్యకర్తగా తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. 2040 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే తిరుగులేని మహాశక్తిగా నిలపాలని ప్రధాని మోదీ దృఢ సంకల్పంతో అహర్నిశలు శ్రమిస్తున్నారని సుధాకర్ రెడ్డి తెలిపారు. మోదీ చేస్తున్న ఈ మహా యజ్ఞంలో తాను సైతం ఒక సమిధగా పాల్గొంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తన మనోభావాలను పంచుకున్నారు. నరేంద్ర మోదీ తన నాయకుడు అని ప్రపంచానికి గర్వంగా చెబుతానని, దేశ ప్రగతి కోసం ఆయన పడుతున్న తపన, నిరంతర కృషిని చూసి తాను ఎంతో గర్విస్తున్నానని పొంగులేటి ఉద్ఘాటించారు.

# విజయ్‌కి మద్దతిచ్చాక కూడా...

- నాకు సీఎం పదవి ఆఫర్ చేశారు
- నన్ను సీఎం, పళనిస్వామిని డిప్యూటీ సీఎం చేయాలన్నారు
- వీసీకే చీఫ్ తిరుమావళవన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై, మహా:** నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతు లేఖ ఇచ్చిన తర్వాత కూడా తనకు ముఖ్యమంత్రి పదవిని ఆఫర్ చేశారంటూ వీసీకే (విడుతలై చిరుతైగల్ కట్చి) అధ్యక్షుడు థోల్ తిరుమావళవన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. డీఎంకే, ఏఐఏడీఎంకేల నుంచి ఈ ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని తాను నవ్వుతూ తిరస్కరించానని ఆయన స్పష్టం చేశారు. ఓ జాతీయ మీడియా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడిన తిరుమావళవన్, తమిళనాడు రాజకీయాల్లో తెర వెనుక జరిగిన ఆసక్తికర పరిణామాలను వివరించారు. టీవీకేకు మద్దతు ప్రకటించిన తర్వాత కూడా తనకు సీఎం పదవిని ఆఫర్ చేశారని, మద్దతు ఉపసంహరించుకోవాలని, మీడియాతో మాట్లాడొద్దని కూడా సూచించారని ఆయన తెలిపారు. అంతకుముందు, ఎడప్పాడి పళనిస్వామిని సీఎం చేసేందుకు డీఎంకే ప్రతిపాదించగా, తాము, వామపక్షాలు వ్యతిరేకించామన్నారు. ఆ తర్వాత తనను సీఎం, పళనిస్వామిని డిప్యూటీ సీఎంగా చేస్తామంటూ మరో ప్రతిపాదన వచ్చిందని, "తమిళనాడులో ఇలాంటివి జరగవు" అని చెప్పి ఆ ఆఫర్‌ను నవ్వేసి కొట్టిపారేశానని వివరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయ్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించినా, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీకి కొద్ది దూరంలో నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే డీఎంకే, ఏఐఏడీఎంకేలు తెర వెనుక చర్చలు జరిపినట్లు తిరుమావళవన్ వ్యాఖ్యలు ధృవీకరిస్తున్నాయి.

# రోడ్లపై నమాజ్‌లు వద్దు

**లక్నో :** రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేనని లక్నోలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

# కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు జులై 27వ తేదీకి వాయిదా వేసింది. జూబ్లిహిల్స్, మాదాపూర్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ కష్టాల నుంచి వాహన దారులను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణానికి నడుం కట్టింది. ఇందుకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించింది. అయితే పార్క్ పరిసరాలలో చెట్లను నరికి వేయడంతో గత కొంత కాలంగా పర్యావరణ ప్రేమికులు ఆందోళన చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలన్న సంకల్పంతో పాటు పర్యావరణానికి ఏ మాత్రం హామి జరుగకుండా పనులను చేపడుతున్నామని చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ ధ్వంసంపై ఆగ్రహం వ్యక్తం చేసిన పర్యావరణ ప్రేమికులు సుప్రీం కోర్టుకు ఆశ్రయించడంతో స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం నిర్ణయంపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.



# యుద్ధం పరిష్కారం కాదు

**మహా:** నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా నార్వే రాజధాని ఓస్లో చేరుకున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ దేశ ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కీలక ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉగ్రవాద నిర్మూలన, ప్రపంచ శాంతి, ద్వైపాక్షిక వాణిజ్యం, సముద్ర భద్రత తదితర కీలక అంశాలపై ఇరు దేశాల నేతలు సుదీర్ఘంగా మంతనాలు సాగించారు. అత్యంత క్లిష్టసమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశానికి నార్వే అండగా నిలిచి తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ సమూలంగా నిర్మూలించడం ప్రపంచ దేశాల ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

**సైనిక ఘర్షణలతో శాశ్వత శాంతి అసాధ్యం**

సైనిక ఘర్షణల ద్వారా మాత్రమే శాశ్వత శాంతిని సాధించలేమని, ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలను కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. నియమ, నిబంధనలతో కూడిన ప్రపంచ వ్యవస్థను భారత్, నార్వే దేశాలు బలంగా విశ్వసిస్తాయని, శాంతి స్థాపన కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి తమ మద్దతు ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. అలాగే, పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి లాంటి అంతర్జాతీయ సంస్థలలో తక్షణమే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ విషయంలో భారత్, నార్వే ఒకే అంచనాతో, ఏకాభిప్రాయంతో ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పహల్గాం దాడి సమయంలో నార్వే అండ**

గతేడాది పహల్గాంలో హిందూ పురుషులే లక్ష్యంగా జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో 26 మంది భారత పౌరులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. ఆ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశానికి అండగా నిలబడి నార్వే తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రశంసించారు. వాస్తవానికి గత ఏడాదే తన నార్వే పర్యటన జరగాల్సి ఉన్నప్పటికీ, పహల్గాం ఉగ్రదాడి వల్లే వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ఆ విపత్కర సమయంలో నార్వే చూపిన సంఘీభావానికి మోదీ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**వ్యూహాత్మక భాగస్వామ్యం.. గ్రీన్ స్ట్రెటజీ**

భారత్, నార్వేల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల ఇరు దేశాలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్‌కు భారీగా వస్తున్నాయని ప్రధాని వివరించారు. ఇటీవల భారత్, ఈయూ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందం ఇరు దేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయని, ముఖ్యంగా ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య ఉన్న ఒప్పందాలతో అంతరిక్ష పరిశోధనలు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇరు దేశాలు సంయుక్తంగా అవలంబిస్తున్న గ్రీన్ స్ట్రెటజీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.

**మోదీకి నార్వే అత్యున్నత పురస్కారం**

మారిటైమ్ భద్రత విషయంలోనూ భారత్, నార్వే కలిసి పనిచేస్తున్నాయని, భారతదేశం నేతృత్వంలోని 'ఇండోపసిఫిక్ ఓషన్స్ ఇనీషియేటివ్'లో చేరాలని నార్వే తీసుకున్న నిర్ణయాన్ని మోదీ అభినందించారు. రెండు ప్రధాన సముద్రతీర దేశాలుగా సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ, సముద్ర భద్రత, సామర్థ్య పెంపుదలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా నార్వే ప్రభుత్వం, తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్'తో ప్రధాని నరేంద్ర మోదీని ఘనంగా సత్కరించింది. ప్రధాని మోదీ అందుకున్న అంతర్జాతీయ పురస్కారాల్లో ఇది 32వ పురస్కారం కావడం విశేషం.

# 3 గంటల్లోనే హైదరాబాద్ టు ముంబయి

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం రోడ్డు మార్గంలో 12 గంటలు, రైలు మార్గంలో 15 గంటల సుదీర్ఘ సమయం పడుతుండగా, ఇకపై కేవలం మూడు గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకునేలా 'హైదరాబాద్‌పుణెముంబయి' హైస్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. గంటకు గరిష్ఠంగా 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే ఈ రైలు కారిడార్‌కు సంబంధించి సర్వే పూర్తి కావడంతో పాటు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా సిద్ధమైనట్లు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) తెలంగాణ ప్రభుత్వానికి అధికారికంగా వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లోనే చేరుకోవచ్చు. మొత్తం 671 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రాజెక్టును మూడు రాష్ట్రాల మీదుగా నిర్మించనున్నారు. ఇందులో అత్యధికంగా మహారాష్ట్ర పరిధిలో 457 కిలోమీటర్లు (68 శాతం), కర్ణాటకలో 121 కిలోమీటర్లు (18 శాతం), తెలంగాణలో 93 కిలోమీటర్ల (14 శాతం) మేర ఈ రైలు మార్గం ఉంటుంది. తెలంగాణలో హైదరాబాద్ పరిధిలోని కోకాపేట, వికారాబాద్, అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో స్టేషన్లను ప్రతిపాదించారు. కర్ణాటకలోని కలబురగిలో ఒక స్టేషన్ ఉండగా, మహారాష్ట్రలో పుణె, బారామతి, పంఢర్‌పూర్, సోలాపూర్, విక్రోలి, థానే, నవీ ముంబయి, లోనావాలా, పింప్రి చించ్వాడ్ తదితర ప్రాంతాల్లో రైలు ఆగేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం దేశంలోనే ఓ అద్భుతమైన ఇంజనీరింగ్ ఘట్టంగా నిలవనుంది. హైదరాబాద్ మెట్రో రైలు తరహాలో పిల్లర్లపై ఎలివేటెడ్ ట్రాక్ నిర్మిస్తారు. అయితే, మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో ఏకంగా 35.30 కిలోమీటర్ల మేర మార్గాన్ని భూగర్భంలో నిర్మించనుండటం విశేషం. ఖండాల ఘాట్ ప్రాంతంలోని కొండలను తొలిచి 24 కిలోమీటర్ల పొడవునా మొత్తం 13 సొరంగాలను (టన్నెల్స్) నిర్మిస్తారు. ఈ కారిడార్ పొడవునా 13 స్టీల్ వంతెనలతో కలిపి మొత్తం 101 బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ముఖ్యంగా ప్రధాన నదులపై 29 భారీ వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ములాముఠా నదిపై 360 మీటర్లు, భీమా నదిపై 280 మీటర్లు, బోరి నదిపై 225 మీటర్ల పొడవైన భారీ వంతెనలు ఇందులో ఉన్నాయి. బుల్లెట్ ట్రైన్ వేగమే కాదు, అవి ఆగే స్టేషన్లు కూడా అంతర్జాతీయ విమానాశ్రయాలను తలపించేలా ఉండనున్నాయి. భవన నిర్మాణం, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఒక్కో స్టేషన్‌కు ఏకంగా 247 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు విషయమై ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ అధికారులు ఇటీవల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, రవాణా శాఖ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్‌లతో సమావేశమై ప్రాజెక్టు విశేషాలను వివరించారు.

# ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సీఎం అయ్యారు

## విజయ్‌పై స్టాలిన్ సెటైర్లు

**చెన్నై, మహా:** ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పిల్లలను ఇన్‌ఫ్లుయెన్స్ చేసి సీఎం అయ్యారు అంటూ.. తమిళనాడు సీఎం, టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్‌పై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ సెటైర్లు వేశారు. తంజావూర్‌లోని ఓ వివాహ రిసెప్షన్లో పాల్గొన్న ఆయన.. 'విజయ్ పార్టీకి సరైన (పోలింగ్) బూత్ ఏజెంట్లు కూడా లేరు. కానీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పిల్లలను ప్రభావితం చేసి సీఎం అయ్యారు' అని వ్యాఖ్యానించారు. సమాజంపై సోషల్ మీడియా ఎంతటి ప్రభావం చూపుతుందో అంచనా వేయడంలో తాము విఫలమైనట్లు ఈ వ్యాఖ్యల ద్వారా మాజీ సీఎం అంగీకరించారు. "సోషల్ మీడియాను, ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించి.. పిల్లల ద్వారా వారి తల్లులు, అమ్మమ్మ నానమ్మలు, పెద్దలను ప్రభావితం చేసేలా ప్రచారం చేయించారు. దాన్ని గమనించడంలో మేం విఫలం అయ్యాం" అని డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఇకపై ఇలాంటి చర్యలను తిప్పికొట్టేందుకు పార్టీ కొత్త వ్యూహాలను రూపొందిస్తుందని ఆయన తెలిపారు.

## ఉత్పత్తి లక్ష్యాల సాధనే ధ్యేయంగా
# ఉద్యోగులు పునరంకితం కావాలి

**మందమర్రిలో ఘనంగా మల్టీ డిపార్ట్ మెంటల్ సమీక్ష సమావేశాలు**



**మందమర్రి, మహా :** ఉత్పత్తి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ఉద్యోగులు పునరంకితం కావాలని స్థానిక జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ వెల్లడించారు. సోమవారం ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ (సీహెచ్‌పీ), మందమర్రి ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల సాధన లక్ష్యం నెరవేరాలంటే కార్మికులు రక్షణ సూత్రాలను పాటిస్తూ అధికోత్పత్తి సాధించాలని కోరారు. భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో ఉన్న అత్యాధునిక యంత్రాలను సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ లాభాలలో ఉంటే వివిధ రంగాలలో విస్తరించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం యాజమాన్యం ఉద్యోగుల కొరకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు మరో పరిశ్రమలలో లేవని చెప్పారు. భారత దేశంలో విదేశీ బొగ్గు దిగుమతి కారణంగా పోటీ విపరీతంగా ఉందని అన్నారు. గని ఉద్యోగులు యాజమాన్యం సూచించిన సలహాలు, సూచనలను నిరంతరం పాటించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను మరింత పెంచవచ్చని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు బానయ్య, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి జ, ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ ఏజీఎం (ఏంఅండ్ఏ), సిహెచ్. అశోక్ (డీజీఎం పర్సనల్), కె. కిరణ్ కుమార్ (డీజీఎం ఐఈడీ), రవి (ఐటీ డిప్యూటీ మేనేజర్), ప్రదీప్ (క్వాలిటీ ఇంచార్జ్), చంద్రమౌళి ఎస్.ఈ (ఈ అండ్ ఎం), వర్క్‌షాప్ ఇంచార్జ్ డీజీఎం (ఈఅండ్ఎం) ధూప్ సింగ్, ఏరియా స్టోర్ ఇంచార్జ్ సురేష్ డీజీఎం (ఈఅండ్ఎం), శశిధర్ (ఈ.ఈ), ఐఈడీ మేనేజ్‌మెంట్ ట్రైనీ శ్యామ్ తో పాటు ఆయా విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్ (సీ.హెచ్.పీ) సమావేశం**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సీ.హెచ్.పీ నిర్వహించిన మల్టీ డిపార్ట్మెంట్ సమావేశంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ఇప్పకాయల లింగయ్య, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జ, ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ (ఏజీఎం ఎఫ్&ఏ), సిహెచ్. అశోక్ (డీజీఎం పర్సనల్), కె. కిరణ్ కుమార్ (డీజీఎం ఐఈడీ), రవి (ఐటీ డిప్యూటీ మేనేజర్), ప్రదీప్ (క్వాలిటీ ఇంచార్జ్), చంద్రమౌళి (ఎస్.ఈ ఈ అండ్ ఎం, ఐఈడీ మేనేజ్‌మెంట్ ట్రైనీ శ్యామ్, సీహెచ్‌పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

సిపిగెట్2026 వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో అప్లై చేయాలి

అందుబాటులో ఎంఏ ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, ఎం.కామ్ కోర్సులు

ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో పిజి ఎంఏ ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, ఎంకాం కోర్సుల లో అడ్మిషన్ కోసం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న మరియు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు సిపిగెట్ 2026 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కాకతీయ విశ్వవిద్యాలయం సమన్వయంతో "తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్" నోటిఫికేషన్ను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభమయ్యాయని చెప్పారు. జూన్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఎంఏ ఇంగ్లీష్ మరియు పొలిటికల్ సైన్స్ చదవడానికి ఏదైనా డిగ్రీ చదివినవారు అర్హులని, ఎంకామ్ కోర్సుకు మాత్రం డిగ్రీలో బీకాం చదివిన వారు మాత్రమే అర్హులని వివరించారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంపై
# అధికారులు దృష్టి సారించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాలకు చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు చేపట్టాలని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల కృషి చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, దిగుమతి, హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి
- జిల్లాలో 37 పీపీసీ కేంద్రాల ప్రారంభం
- 7,187 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇందుకు గాను రైతుల ఖాతాల్లో రూ.6 కోట్లు జమ
- నిబంధనలను ఉల్లంఘిస్తే మిల్లర్లపై క్రిమినల్ కేసులు
- అన్ని ప్రాంతాల్లోని వెయ్‌బ్రిడ్జ్‌లలో తూకం ఒకే విధంగా ఉండాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తూ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాము. ఇప్పటి వరకు 37 పీపీసీ కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. వీటి ద్వారా 7,187 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందుకు గాను రైతుల ఖాతాల్లో రూ.6 కోట్లు జమ చేయడం జరిగిందని అదనం కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. రైస్ మిల్లర్లు తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని, ఎలాంటి నాణ్యత కోతలు (తరుగు) విధించకుండా ధాన్యాన్ని స్వీకరించాలని సూచించారు. అలాగే మిల్లుల వద్ద ఏ వాహనం కూడా ఒక రోజు కంటే ఎక్కువ కాలం నిల్వ ఉండకూడదని హెచ్చరించారు. ఈ విషయంలో ఏవైనా ఉల్లంఘనలు గమనించినట్లయితే సంబంధిత వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏఈఓలు ధాన్యం నాణ్యతను సక్రమంగా ధృవీకరించాలని, ధృవీకరణ అనంతరం నాణ్యతపై ఎటువంటి ఫిర్యాదులు రావద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా కోసం, కాంట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచాలని హెచ్చరించారు. అలాగే డీఎల్‌ఎంఓ, వెయ్‌బ్రిడ్జ్‌లను తనిఖీ చేసి, అన్ని ప్రాంతాల్లో తూకం ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించేందుకు అదనపు కలెక్టర్ మరియు ఈఓఈడి(Rev), జిల్లా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (Rev), జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి, ఫీల్డ్ స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఎం., డీసీఎస్ఓ, డీఆర్‌డీఓ, డీఎంఓ, డీఎల్‌ఎంఓ, డీసీఓ మరియు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 92 ఫిర్యాదులు...

- సోమవారం ప్రజావాణిలో బారులు తీరిన ఫిర్యాదుదారులు
- ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి
- సంబంధిత అధికారులకు ఆదేశాలు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (92) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జనాభా గణన2027 కార్యక్రమంలో పాల్గొన్న, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో నిర్వహి జనాభా గణన2027 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేయాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏ ఒక్క కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్) జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కరించాలి



- ప్రారంభమైన ఐకెపి వివోఏల సమ్మె
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వివోఏల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రారంభమైన వివోఏల సమ్మె, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, ఐకెపి వివోఏ మండల సలహాదారులు చంద్రశేఖర్ మాట్లాడుతూ... వివోఏల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా వివిధ రూపాలలో సమస్యలను విన్నవించామని అయినా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. వివో ఏ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో సమ్మె నిర్వహిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వివోఏలకు అనేక హామీలు ఇచ్చిందని ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు పూర్తయిన నేటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనం 26 వేలు నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వివోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ప్రమాద బీమా కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపి వివోఏల సంఘం చేవెళ్ల మండల అధ్యక్షురాలు కవిత ప్రధాన కార్యదర్శి ఆలూరు ప్రమీల, కోశాధికారి జ్యోతి వివోఏలు శంకర్ సుజాత ప్రేమలత అమృత నిర్మల సల్మా అస్రా బేగం లలిత స్వప్న హేమలత కవిత లలిత సుశీల తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ప్లాట్లు అమ్మొద్దు.. కొనొద్దు..




- కాలనీలో భూకబ్జాదారులకు రెవెన్యూ వార్నింగ్
- అక్రమ లావాదేవీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**కుషాయిగూడ, మహా :** కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడలో జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన ప్లాట్ల విషయంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. సర్వే నంబర్ 538లో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల కాలనీలో ఎవరూ ప్లాట్లను అమ్మరాదని, కొనుగోలు చేయరాదని స్పష్టం చేస్తూ కాలనీ పరిధిలో పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమ లావాదేవీలు, భూకబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అధికారులు ఈ చర్యలకు దిగినట్లు తెలిసింది.కీసర తహసీల్దార్ పి. యాదగిరి రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనంతరం "ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన పట్టా భూములు... ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదు" అని పేర్కొంటూ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు, దళారి వ్యవహారాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.ఇటీవల కొంతమంది భూకబ్జాదారులు కాలనీలోని ఖాళీ ప్లాట్లపై కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయాలకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అమాయకులను మోసం చేసి ప్లాట్లు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు కఠిన వైఖరి అవలంబిస్తున్నారు.కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా భూముల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాల్లో పాల్గొంటే వెంటనేరెవెన్యూ శాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. జర్నలిస్టులకు కేటాయించిన భూములపై ఎలాంటి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరిగినా వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కేటాయించిన భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అధికారులు పేర్కొన్నారు. కాలనీలో భద్రతా చర్యలు మరింత పెంచడంతో పాటు తరచూ పర్యవేక్షణ చేపట్టాలని స్థానిక జర్నలిస్టులు, కాలనీ వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగతిన పరిష్కరించాలి...



- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజావాణి ద్వార తమ సమస్యలు పరిష్కారించాలని 21 దరఖాస్తులు ప్రజలు చేసుకున్నట్లు ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి అనంతరం అర్జిఓ మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం రెవిన్యూ డివిజన్ స్థాయి ప్రజావాణి స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో భూ భారతికి 4, ఫించన్లు, విధ్యుత్తు లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని, ఇందిరమ్మ మంజూరికై 1, పలు మండలాల్లో పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలని 9, ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాలని పలు సమస్యలపై ప్రజలు పిర్యాధు చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపించి త్వరలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఆర్డీఓ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గోన్నారు.

## హిమాయత్ నగర్ లో నిర్వహించిన మారథాన్

**పాల్గొన మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా హిమాయత్ నగర్ లోని నిర్వహించిన మారథాన్ ఎన్టిఆర్ స్కూల్ నుండి 2k రన్ నిర్వహించిన మొయినాబాద్ మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్ విచేసి జెండా ఊపి ప్రారంబించారు మారథాన్ ఎన్టీఆర్ స్కూల్ నుండి ప్రారంభం అయిన మారథాన్ 2k రన్ ఎంకేపల్లి చౌరస్తా నుండి తిరిగి ఎన్టిఆర్ స్కూల్ వరకు చేరుకున్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్ల పాటి కవిత ఎల్లేష్. షాబాద్ కిషన్ మరియు అంబేద్కర్ యువజన అధ్యక్షులు కట్టమీది శ్రీను. కట్టమీది ప్రకాష్ కట్టమీది కృష్ణ పూడూరు ప్రవీణ్ కామారెడ్డి గణేష్ రాము. మాల శ్రీను మున్సిపల్ అధికారులు మరియు సిబంది విద్యార్థులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ పూల్ లో పడి వ్యక్తి వృతి

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలో ఓ ఫాంహౌస్ లో వ్యక్తి అనుమానాస్పదంగా వృతి చెందిన ఘటన చోటు చేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మజీద్బండ ప్రాంతానికి చెందిన సాయికుమార్ s/o బిక్షపతి తన ఇంట్లో విజయవాడ వెళ్తున్నట్లు చెప్పి శనివారం ఉదయం సుమారు 8 గంటలకు తన స్నేహితులతో కలిసి నగర శివారులోని మొయినాబాద్ మండలం కనకమామిడి లోని వ్యాన్ అనే ఫాంహౌస్ కు వెళ్లారు. పార్టీ చేసుకుంటున్న సమయంలో సాయి కుమార్ స్విమ్మింగ్ పూల్ లో పడి వృతి చెందడంతో వృతుడి స్నేహితుడు జావీద్ సాయికుమార్ తుమ్ముడు కోడిచర్ల ప్రభాస్ కి ఆదివారం ఉదయం 4:27 గంటలకు ఫోన్ చేసి తన అన్న సాయి కుమార్ (28) మృతిచెందినట్లు ప్రస్తుతం భాస్కర్ హాస్పిటల్ లో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై
# పార్లమెంటరీ కమిటీ సీరియస్

- దర్యాప్తు పురోగతిపై 21న విచారణ
- లాతూర్‌లో మరో కీలక నిందితుడి అరెస్టు
- ఎన్‌టీఏలో సంస్కరణలపై రాధాకృష్ణన్ కమిటీ నివేదిక సమీక్ష
- జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్
- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో వైద్య ప్రవేశ పరీక్ష

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన 'నీట్ యూజీ 2026' ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఒకవైపు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తనదైన శైలిలో విచారణను వేగవంతం చేసి నిందితులను కటకటాల వెనక్కి నెడుతుండగా, మరోవైపు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రక్షాళనకు పార్లమెంటరీ స్థాయి సంఘం నడుం బిగించింది. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న ఈ అతిపెద్ద కుంభకోణం మూలాలను వెలికితీసేందుకు, అలాగే దర్యాప్తు పురోగతిని లోతుగా సమీక్షించేందుకు కమిటీ అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాల్సిన ఆవశ్యకతను గుర్తిస్తూ, విచారణల పర్వానికి పార్లమెంటరీ కమిటీ తెరతీసింది. ఈ క్రమంలోనే అరెస్టుల పర్వం కొనసాగుతుండగా, కేంద్ర విద్యాశాఖ సైతం సత్వర దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

**ఎన్‌టీఏ ఉన్నతాధికారులకు పార్లమెంటరీ కమిటీ నోటీసులు**

నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలపై కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని 'విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం' కఠిన వైఖరిని అవలంబించింది. ఎన్‌టీఏలో సంస్కరణల అమలుతో పాటు పేపర్ లీక్ కేసును సమగ్రంగా సమీక్షించాలని ఈ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పూర్తి స్థాయి చర్చల కోసం ఎన్‌టీఏ ఛైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషితో పాటు ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, కేసు దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని, అలాగే ఈ నెల 21న కమిటీ ముందు విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సమావేశంలో విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత అధికారుల నుంచి సైతం కమిటీ తమ అభిప్రాయాలను సేకరించనున్నట్లు రాజ్యసభ అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది.

**దర్యాప్తు పురోగతి, రాధాకృష్ణన్ కమిటీ నివేదికపై సుదీర్ఘ సమీక్ష**

మే 21న జరగనున్న ఈ అత్యున్నత స్థాయి సమావేశ అజెండాలో ప్రధానంగా ఎన్‌టీఏ సంస్కరణలపై ఏర్పాటైన 'కె. రాధాకృష్ణన్ కమిటీ' నివేదిక అమలుతీరుపై చర్చించనున్నారు. దీనికి తోడుగా, నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దర్యాప్తు పురోగతిని కమిటీ సభ్యులు స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. కేవలం కుంభకోణాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంపై కృత్రిమ మేధస్సు (ఏఐ) చూపుతున్న ప్రభావం, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన వ్యూహాలపై కూడా ఈ కమిటీ విస్తృతంగా చర్చించనుంది. ఈ కీలక చర్చల కోసం ఆంత్రోపిక్ ఇండియా, ప్రథమ్, ఐఐటీ కాన్పూర్, ఇన్ఫోసిస్, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధులను సైతం కమిటీ సమావేశానికి ఆహ్వానించారు.

**మైనారిటీ విద్య, రిజర్వేషన్లు, జాతీయ విద్యా విధానంపై చర్చలు**

ప్రధాన అజెండాతో పాటు మరొక ప్రత్యేక సమావేశంలో పలు సామాజిక, విద్యా సంబంధిత అంశాలపై కూడా ఈ పార్లమెంటరీ కమిటీ దృష్టి సారించనుంది. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) ఉపకులపతి, మైనారిటీ విద్యా సంస్థల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎంఈఐ) ఛైర్‌పర్సన్‌తో కమిటీ సభ్యులు ముఖాముఖి చర్చలు జరపనున్నారు. విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల అమలు తీరు, ఖాళీల భర్తీ, జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) వంటి సున్నితమైన అంశాలపై వీరు సమీక్ష జరపనున్నారు. అలాగే మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన 365వ నివేదికలోని సిఫార్సుల అమలు, 'జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి' (ఎన్‌సీటీఈ) పనితీరుపై రూపొందించిన 380వ నివేదికలను కూడా కమిటీ నిశితంగా పరిశీలించనుంది.

**లాతూర్‌లో ముమ్మర దాడులు.. ఆర్‌సీసీ ఫౌండర్ శివరాజ్ అరెస్టు**

ఒకవైపు పార్లమెంటరీ స్థాయి సంఘం విచారణలకు సిద్ధమవుతుండగా, మరోవైపు సీబీఐ అధికారులు ఫీల్డ్‌లో తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని లాతూర్ కేంద్రంగా సాగిన లీకేజీ దందాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. లాతూర్‌లో 'రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్' (ఆర్‌సీసీ) ఫౌండర్ శివరాజ్ రఘునాథ్‌ను సీబీఐ అధికారులు వలపన్ని అరెస్టు చేశారు. ప్రశ్నపత్రం లీకేజీతో పాటు, దానిని ఇతర ప్రాంతాలలోని విద్యార్థులకు, దళారులకు చేరవేసిన భారీ నెట్‌వర్క్‌లో శివరాజ్ కీలక సభ్యుడని దర్యాప్తు అధికారులు ఆధారాలతో సహా గుర్తించారు. కోచింగ్ సెంటర్ ముసుగులో విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించిన ఇలాంటి వ్యక్తుల పాత్ర వెలుగులోకి రావడం సంచలనంగా మారింది.

**సెల్‌ఫోన్‌లో దొరికిన ప్రశ్నాపత్రం.. తొమ్మిది రోజుల కస్టడీకి నిందితుడు**

శివరాజ్ రఘునాథ్ పాత్రపై పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన సీబీఐ అధికారులకు కీలక ఆధారాలు లభించాయి. సోదాల్లో భాగంగా అతడి మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి విశ్లేషించగా, అందులో లీక్ అయిన నీట్ ఒరిజినల్ ప్రశ్నపత్రం స్పష్టంగా కనిపించింది. ఈ డిజిటల్ ఆధారంతో అతడిని వెంటనే అరెస్టు చేసిన అధికారులు, తదుపరి విచారణ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దర్యాప్తులో రాబట్టాల్సిన కీలక సమాచారం నేపథ్యంలో కోర్టు అతడికి తొమ్మిది రోజుల పాటు సీబీఐ కస్టడీ విధించింది. ఈ కస్టడీ విచారణలో శివరాజ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొంత మంది దళారుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది అభ్యర్థులు హాజరైన నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, పక్కా ఆధారాల నేపథ్యంలో మే 3న జరిగిన ఎగ్జామ్‌ను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
19-05-2026
కేరళం ప్రత్యేకం
04




# కేరళం సీఎం ప్రమాణస్వీకారం

**20 మందితో కేబినెట్ .. తొలిరోజే హామీల అమలు దిశగా అడుగు.. ఆశా వర్కర్లకు 3 వేలు పెంపు, ఉచిత బస్సు సహా ..!**







**మహా, ప్రత్యేకం:** కేరళం లో తాజాగా ఎన్నికల్లో ఘన విజయం సాధించిన యూడీఎఫ్ సోమారం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉదయం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీఎంగా వీడీ సతీశన్ తో పాటు మొత్తం 20 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమం తర్వాత వెంటనే సచివాలయానికి వెళ్లి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వీడీ సతీశన్.. అనంతరం కేబినెట్ భేటీ ఏర్పాటు చేసి సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సీఎం వీడీ సతీశన్ తానే స్వయంగా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఎక్స్ లో పెట్టిన పోస్టులో వీడీ సతీశన్.. యూడీఎఫ్ ప్రభుత్వం చెప్పిన మాట నిలబెట్టుకుందన్నారు. తమ మొట్టమొదటి కేబినెట్ సమావేశంలోనే ఆశా కార్యకర్తల గౌరవ వేతనాన్ని రూ.3,000 పెంచడానికి ఆమోదం తెలిపామన్నారు. అలాగే వృద్ధుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వంట కార్మికులు, ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఆయాల గౌరవ వేతనాల పెంపునకు కూడా ఆమోదం ఇచ్చినట్లు సతీశన్ వెల్లడించారు. వీటితో పాటు మహిళలకు కేరళం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం జూన్ 15 నుండి అమల్లోకి వస్తుందని ఆయన ప్రకటించారు. ఇలా మొదటి రోజు నుంచే తమ వాగ్దానాలను నెరవేరుస్తున్నామని వీడీ సతీశన్ సంతోషంగా వెల్లడించారు. కేరళలో కాంగ్రెస్, ఐయూఎంఎల్ కూటమి అయిన యూడీఎఫ్ పదేళ్ల తర్వాత విజయం సాధించింది. దీంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకునే విషయంలోనూ అదే దూకుడు కొనసాగిస్తోంది. ఇప్పటికే సీఎం ప్రమాణస్వీకారానికి విపక్ష నేతలందరినీ ఆహ్వానించడంతో పాటు దగ్గరుండి రప్పించిన వీడీ సతీశన్.. ఇకపై పాలనపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టబోతున్నారు.








# బీఆర్ఎస్ హయాంలో దోపిడీ

## కాంగ్రెస్ పాలనలో రైతులకు అండ అంతర్గాం కాంగ్రెస్ నాయకులు



**అంతర్గాం:** రామగుండం నియోజకవర్గంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శ్రమిస్తున్నారని అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆకెనపల్లి గ్రామ సర్పంచ్ స్రవంతి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐకేపీ కేంద్రాల్లో క్వింటాల్‌కు 10 నుండి 15 కిలోల వరకు తరుగు పేరిట రైతులను అడ్డగోలుగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఒక్క గింజ కూడా తరుగు తీయకుండా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో లారీల కొరత లేకుండా చూస్తూ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నామని, రాబోయే వారం, పది రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిగా ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రైతు రుణమాఫీని అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా నిలిచిందని కొనియాడారు,గతంలో ఆర్ఎఫ్‌సిఎల్ (RFCL) ఉద్యోగాల పేరిట యువత నుండి లక్షలాది రూపాయల లంచాలు వసూలు చేసి మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హయాంలో ఎన్టీపీసీ (NTPC), మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అంతర్గాం మండల పరిధిలోని పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టానికి దక్కిన గౌరవం..

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కందుల సంధ్యారాణి
## సంధ్యారాణి నియామకం పట్ల బిజెపి శ్రేణులు హర్షద్వానాలు



**రామగుండం :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కందుల సంధ్యారాణి నియామకం కావడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి క్రమంగా ఎదుగుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన ఆమెకు ఈ పదవి రావడం కష్టానికి దక్కిన గౌరవంగా నాయకులు అభివర్ణిస్తున్నారు. సంధ్యారాణి 2006 నుంచి 2008 వరకు ఎంపీటీసీగా, 2008 నుంచి 2014 వరకు రామగుండం ఎంపీపీగా సేవలందించారు. అనంతరం 2014 నుంచి 2019 వరకు, అలాగే 2019 నుంచి 2023 వరకు వరుసగా రెండు సార్లు జెడ్ పి టి సిగా ప్రజాసేవలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలతో మమేకమై పని చేసిన నాయకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన సంధ్యారాణి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ బీసీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని పలువురు నాయకులు కొనియాడుతున్నారు. ఆమె నియామకం బీసీ మహిళలకు మరింత ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. రామగుండం ప్రాంతంలో మహిళల సమస్యల కోసం నిరంతరం పోరాడే పోరాట వనితగా కందుల సంధ్యారాణి ప్రత్యేక గుర్తింపు పొందారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచి సేవలు అందించిన ఆమెను స్థానికులు "కరోనా కాలపు ఝాన్సీ రాణి లక్ష్మీబాయి"గా అభివర్ణిస్తున్నారు. పార్టీ పట్ల నిబద్ధత, కష్టపడే తత్వం, ప్రజల పట్ల మమకారం, సేవా దృక్పథమే ఆమెను ఈ స్థాయికి తీసుకువచ్చాయని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తూ బీసీ వర్గాల అభ్యున్నతికి పనిచేస్తానని కందుల సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ

# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సైకిల్ యాత్ర

### ఈరోజు నుండి నెల రోజులపాటు కాన్వాయ్ వాడ సైకిల్, ఎలక్ట్రికల్ బైక్ తప్ప



**ఆలేరు, మహా:** కేంద్రంలో మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సైకిల్ యాత్ర చేపట్టారు నేడు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి పాదాల వద్ద నుండి కొలనుపాక సోమేశ్వర ఆలయం వరకు సోమవారం సైకిల్ యాత్ర చేశారుమధ్య మధ్యలో వంగపల్లి, రామాజీపేట, పెద్ద కందుకూర్, చిన్న కందుకూర్, బాహుపేట, ఆలేరు మార్కెట్ కమిటీ, కొలనుపాకలలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేసి లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులను ఆదేశించారు... జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు... ఈ సందర్భంగా ఆలేరు మార్కెట్ యార్డ్ లో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రధాని మోడీ నిజస్వరూపం బయటపడ్డదని నిత్యవసర సరుకుల ధరలు పెట్రోలు డీజిల్ ధరలు పెంచనని నమ్మబలికి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక మాట మార్చి ధరలు పెంచి పేద ప్రజలపై భారం మోపారని దుయ్యబట్టారు పెట్రోల్ డీజిల్ ధరలను నిరసిస్తూ నెల రోజులపాటు ప్రభుత్వ కాన్వాయ్ వాహనాలు వాడకుండా సైకిల్, ఎలక్ట్రికల్ బైకులపైనే గ్రామాలు పర్యటిస్తానని ఎమ్మెల్యే ఐలయ్య తెలిపారు.. కొలనుపాక సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైకిల్ యాత్రలో యాదగిరిగుట్ట, ఆలేరు కాంగ్రెస్ నాయకులు నీలం పద్మ వెంకటస్వామి, వైస్ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు గంద మల్ల అశోక్, చిర్ర శ్రీశైలం, నాయకులు వెంకటేశ్వరరాజు, సాగర్ రెడ్డి, బీజాని భాస్కర్, ఎజాజ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల నేపథ్యంలో పర్యాటకశాఖ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరెట్ లోని సమావేశ మందిరంలో లో99 రోజుల కార్యచరణ ప్రణాళికను, యువ టూరిజం క్లబ్స్ కార్యచరణ పైన రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగామే 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు ఈ కార్యక్రమం లో జెడ్పి సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనంజనేయులు , డి పి ఆర్ ఓ అరుంధతి, హౌసింగ్ పీడీ అలివేలు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాము

### మిల్లర్లకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశం



**భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం అధికారులతో మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులకు మిల్లర్లకు సూచించారు రైతులు ఎవరు అధైర్య పడవద్దని చివరి గింజ వరకు వద్దు కొనుగోలు చేస్తామని ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు

# చెరువు సింగారంలో అభివృద్ధి పరుగులు

### మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



**బూర్గంపహాడ్ మహా :** ముసలమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు సింగారం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు.ఎన్నికల సమయంలో గ్రామ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు గౌరవ సర్పంచ్ పూణెం సురేంద్ర, ఉపసర్పంచ్ కుమారి ఆధ్వర్యంలో గ్రామానికి మూడు సీసీ రోడ్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. ముఖ్యంగా పోడియం శ్రీను ఇంటి వద్ద నుండి మల్లం నాగేంద్రబాబు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.గ్రామంలో రోడ్లు లేక వర్షాకాలంలో బురద, రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ పనులు ఎంతో ఉపశమనాన్ని కలిగించనున్నాయని స్థానికులు తెలిపారు. గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రతి వీధికి మౌలిక వసతులు అందించే దిశగా చర్యలు కొనసాగుతాయని సర్పంచ్ పూణెం సురేంద్ర పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, ముసలమడుగు సర్పంచ్ పూణెం సురేంద్ర, ఉపసర్పంచ్ కుమారి, గ్రామస్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో
# వరదలు, ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో NDRF మరియు తెలంగాణ SDRF బృందాల ఆధ్వర్యంలో వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రెస్క్యూ సిబ్బంది ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలి, ఇతరులను ఎలా కాపాడాలి అనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.సదస్సులో భాగంగా NDRF, SDRF బృందాలు వరద సమయంలో చేపట్టే రెస్క్యూ ఆపరేషన్లు, ప్రమాద ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానం, లైఫ్ జాకెట్ల వినియోగం, తాత్కాలిక సహాయక చర్యలు వంటి అంశాలను ఆచరణాత్మకంగా చూపించారు. ఆధునిక సాంకేతికతలో భాగంగా డ్రోన్ ద్వారా నిఘా, సహాయక చర్యల నిర్వహణ విధానాన్ని కూడా వివరిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు.అధికారులు గ్రామంలోని వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను సందర్శించి, అక్కడి ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వరద హెచ్చరికలు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదకర ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయడం ఎందుకు అవసరం, సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి అనే అంశాలపై వివరించారు.ఆరెంజ్ రంగు లైఫ్ జాకెట్లు ధరించిన రెస్క్యూ సిబ్బంది, ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ అధికారులు కలిసి నిర్వహించిన డెమోలు విద్యార్థులు, స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విపత్తుల సమయంలో భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా వ్యవహరించాలని, అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ జమలారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్రజలకు విపత్తులపై అవగాహన కల్పించేందుకు తరచూ ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, సిబ్బంది అడిగిన సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, ఎంఆర్వో కెఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, సర్కిల్ సీఐ సతీష్, స్థానిక ఎస్‌హెచ్‌వో ఎస్ఐ మేడ ప్రసాద్, ఆర్టీవో వెంకట పుల్లయ్య, అదనపు ఎస్ఐ నాగబిక్షం, మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహరాజు, పంచాయతీ అధికారులు, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# ఆలేరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఆకాంశ్ యాదవ్




**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పోలీస్ స్టేషన్ మరియు చెక్కపోస్ట్ ను సోమవారం జిల్లా ఎస్పీ శ్రీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్పి అన్నారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్ విభాగం, లాక్ అప్, ఎస్.హెచ్.ఓ గది తదితర విభాగాలను జిల్లా ఎస్పీ పరిశీలించి,స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న మరియు నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగా విచారణ చేసి, చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణ స్పందన చూపాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ విధుల్లో ఉన్న సిబ్బంది డయల్ 100 కాల్స్ లకు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించి, మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ మరియు డయల్ 100 సేవల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే, అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. చెక్ పోస్ట్ నందు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో మాట్లాడి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపవాల్సిందిగా వారికి ఆదేశిస్తూ అదే సమయంలో వాహన తనిఖీ చేయు సిబ్బంది రక్షణ లో కూడా ఎలాంటి సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఆలేరు సీఐ యాలాద్రి, ఎస్.ఐ వినయ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటల్ జన గణన సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం..

- ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



**మణుగూరు, మహా :** భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ జనాభా గణన-2027 కార్యక్రమంలో భాగంగా మణుగూరు మండలంలోని 41వ బ్లాక్‌లో సోమవారం హౌస్ లిస్టింగ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాసంలో ఎన్యూమరేషన్ సిబ్బంది సమగ్ర వివరాలను సేకరించారు. సర్వేలో భాగంగా ఇంటి గోడలు, కప్పు, నేల నిర్మాణ పదార్థాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులతో పాటు కుటుంబ సభ్యులు వినియోగిస్తున్న రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, వాహనాలు తదితర అంశాలపై మొత్తం 34 ప్రశ్నలను అడిగి వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో చేపడుతున్న జనాభా గణన కార్యక్రమం భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజల జీవన పరిస్థితులు, అవసరాలు ప్రభుత్వం దృష్టికి చేరి సంక్షేమ పథకాల అమలుకు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రజలంతా సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 41వ బ్లాక్ సూపర్వైజర్ సుజాత, ఎన్యూమరేటర్ బి శేఖర్, ఉపాధ్యాయులు వివి కోటేశ్వరరావు, బి దేవేందర్, బి జబ్బర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలు, ప్రకృతి విపత్తులపై అవగాహన పెంపు

### బూర్గంపహాడ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్ మహా :** గోదావరి వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో NDRF మరియు SDRF బృందాల ఆధ్వర్యంలో వరదలు, ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వరదలు, భారీ వర్షాలు, తుఫానులు వంటి విపత్తుల సమయంలో ప్రజలు ప్రభుత్వ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు హెచ్చరికలను గౌరవించాలని సూచించారు.ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, NDRF మరియు SDRF బృందాలు విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో ప్రజలకు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాయని పేర్కొన్నారు. విద్యార్థులు, గ్రామ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమాలరెడ్డి, ఏఈ చారి, బూర్గంపహాడ్ సర్పంచ్ మంద నాగరాజు, మోరంపల్లి బంజర్ సర్పంచ్ బొర్రా సుభద్ర, పోలవరం సర్పంచ్ బొల్లి నిరోషా, కోయగూడెం సర్పంచ్ కుంజా కొండమ్మ, పినపాక పంచాయితీ కార్యదర్శి విజయ్, ఏపీఓ మేడం తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ కూలీలకు వేసవి దృశ్య వసతులు కల్పించాలి

### ఎంపీడీవో జలంధర్ రెడ్డి



**వలిగొండ, మహా :** వేసవికాలంను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ కూలీలకు మంచినీటి సౌకర్యం టెంటు ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో జలంధర్ రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లాలని అన్నారు రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో ఆరోగ్య సమస్యల పై జాగ్రత్త పడాలని సూచించారు

# ప్రజావాణిలో 51 అర్జీలు

### రెవెన్యూ శాఖ సంబంధించి 32 దరఖాస్తులు



**యాదాద్రి భువనగిరి, మహా:** వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 51 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 32,హౌసింగ్ 5, జిల్లా సంక్షేమ శాఖ 3, మున్సిపాలిటీ 2, సర్వే ల్యాండ్ 2, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ , ఎక్సైజ్, ఇరిగేషన్, చేనేత జౌళి,జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 2కె రన్ విజయవంతం

### వ్యాయామంతోనే ఆరోగ్యం



**జూలూరుపాడు, మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్ విజయవంతమైంది. మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి జెండా ఊపి ప్రారంభించిన ఈ కార్యక్రమం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద నుండి పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారి పై సాగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవి, ఎస్సై రవి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన శైలికి వ్యాయామం ఎంతో అవసరమని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే గాక రోగాల బారి నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యాయామం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి, వ్యాయామం ప్రాముఖ్యత గురించి వారు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువకులు, ఆరోగ్య జీవనయాత్రికులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## సాంబాయిగూడెం సమస్యల ప్రతిష్కరించాలని..
# ఎమ్మెల్యే పాయంకు గ్రామ ప్రతినిధుల వినతి



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలోని సమస్యలను వివరించారు. గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, కాలువల నిర్మాణం, విద్యుత్ సదుపాయాల మెరుగుదల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిడెం ఉషారాణి, ఉప సర్పంచ్ పి.రమేష్, 2వ వార్డు సభ్యులు బి.ఈశ్వరమ్మ, 3వ వార్డు సభ్యులు జె.స్రవంతి, 4వ వార్డు సభ్యులు టి.వినోద్ కుమార్, 5వ వార్డు సభ్యులు పి.కొండయ్య, 8వ వార్డు సభ్యులు సిహెచ్.నిరోషా, తమ్మిశెట్టి సాంబ పాల్గొన్నారు.

### సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పాత కొత్తగూడెం లో గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని మాజీ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం డివిజన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్రూంల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి కాకుండానే లబ్ధిదారులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇది ఆనాడు ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన మోసంగా పరిగణించక తప్పదని ఆయన విమర్శించారు. 2016లో పాత కొత్తగూడెంలో 826 డబుల్ బెడ్ రూమ్ లను నిర్మాణాన్ని ప్రారంభించారని అందులో కనీసం 200 గృహాలు కూడా పూర్తి కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం ఆరోజు హడావుడిగా నిర్మాణాలు పూర్తి కాకుండానే డ్రా తీయడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి మంజూరు పత్రాలు ఇవ్వకుండానే మోసం చేశారని ఆయన విమర్శించారు. అప్పటి నుండి ఇప్పటికి నిర్మాణాలు పూర్తికాక ఇటు 75 గజాల స్థలంకు, ఇందిరమ్మ గృహాలకు లబ్ధిదారులను అనరులుగా తెల్చారని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్లు నిర్మాణం పూర్తికాక ఇటు ఇందిరమ్మ గృహాలు మంజూరు కాక సంకట స్థితిలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిధులను కేటాయించి నిర్మాణాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్రూంలు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందులో అనర్హులు ఉంటే వాటి వరకే ఆ జాబితా నుండి తొలగించాలే తప్ప మొత్తానికి మల్ల డ్రా తీస్తామంటే అనేకమంది పేదవారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందని తక్షణమే వాటికి నిధులు కేటాయించి అప్పుడు డ్రా తీసిన అర్హులైన వారికే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఓంనారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**యువ టూరిజం క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహించనున్న టూరిజం వారోత్సవాల సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని యువత టూరిజం రంగంపై అవగాహన పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. టూరిజం వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మే 19న పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ రాక్ కేవ్స్ వద్ద హెరిటేజ్ వాక్, మే 21న జిల్లాలోని యూట్యూబర్లతో సమావేశం, మే 22న బౌద్ధ రాక్ కేవ్స్ ప్రాంతంలో స్వచ్ఛత డ్రైవ్, మే 23న పాల్వంచలోని ఐడాక్‌లో బ్రాండ్ కిట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ, సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ కోర్సులను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కోర్సుల ద్వారా పర్యాటక పురావస్తు మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు.కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజును సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# మే 20న మెడికల్ షాపులు బంద్

- **సీఐ శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేసిన మెడికల్ అసోసియేషన్ నాయకులు**
- **అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచన**




**జూలూరుపాడు, మహా:** ఆన్ లైన్ లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏఐఓసిడి) మే 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ పిలుపునిచ్చింది. పిలుపులో భాగంగా సోమవారం మెడికల్ అసోసియేషన్ సుజాతనగర్ యూనిట్ ఆధ్వర్యంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిస్క్రిప్షన్ వెరిఫికేషన్ చూడకుండా ఆన్ లైన్ లో మందులు అమ్ముతున్నారని, భారీ డిస్కౌంట్‌లు ఇస్తూ, మెడికల్ షాపులకు నష్టాలు తెస్తున్నారని, తద్వారా 12.40 లక్షల పైన మెడికల్ దుకాణాలు మూతపడ్డాయని వారు తెలిపారు. కాబట్టి ఆన్ లైన్ లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బందును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బందుకు అందరూ సహకరించాలని వారు కోరారు. అత్యవసర మందులు అవసరం ఉన్నవారు బందుకు ముందే మందులు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తిరుపతి రెడ్డి, సుజాతనగర్ యూనిట్ కార్యదర్శి కూరపాటి గోపాలరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిన్ని సత్యనారాయణ, శ్రీధర్, భాస్కర్, నరసింహారావు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## తులిస్యాతండా లోవోల్టేజి సమస్యకు పరిష్కారం

**విద్యుత్ శాఖ అధికారులకు తండావాసుల కృతజ్ఞతలు**

**కారేపల్లి, మహా:** నెలల తరబడి లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న తులిస్యా తండా గ్రామానికి విద్యుత్ శాఖ అధికారులు అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో తులిస్యాతండా విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సూచనతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సమస్యకు పరిష్కారం చూపడంతో తండావాసులు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కారేపల్లి మండలంలోని తులిస్యాతండా గ్రామ ప్రజలకు సింగిల్ ఫేస్ 25 కే వీఏ ట్రాన్స్ఫార్మర్‌ను పెట్టడం ద్వారా "లో ఓల్టేజ్ సమస్య" కు పరిష్కారం లభించింది. గత కొన్ని నెలలుగా తులాస్యాతండా గ్రామంలో ఒకటే ట్రాన్స్ఫార్మర్ ఉండటంవలన లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నందున స్థానిక సర్పంచ్ ప్రవీణ్ కొందరు నాయకులు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనలతో వైరా విద్యుత్ శాఖ డిఈ యల్లంపల్లి రమేష్, ఏడిఈ యండి.యాసిన్ ల చొరవతో కారేపల్లి మండలం ఏఈ వెంకన్న సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. సోమవారం విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి అదనంగా 25కేవీఏ సామర్థ్యంగల ట్రాన్స్ఫార్మర్‌ను అమర్చడం జరిగింది. నెలలు తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో తులాస్యాతండా గ్రామ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ యాసిన్, ఏఈ వెంకన్న విద్యుత్ శాఖ సిబ్బంది ఫోర్ మెన్ లక్ష్మీనారాయణ. రషీద్, సర్పంచ్ దండు ప్రవీణ్, కాంగ్రెస్ లీడర్ నాగులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి లక్ష్యసాధనకు సమిష్టి కృషి

**పీకేఓసీ-2లో ఘనంగా అవగాహన కార్యక్రమం..**
**మన సంస్థ.. మన గని.. మన బాధ్యత..**
**ఉద్యోగులకు ఏరియా జీఎం రామచందర్ దిశానిర్దేశం..**



**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థను దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు బొగ్గు సంస్థలకు ఆదర్శంగా నిలబెట్టేందుకు అధికారులు, కార్మికులు అంకితభావంతో పనిచేయాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. మన సంస్థ.. మన గని.. మన బాధ్యత నినాదంతో మణుగూరు ఏరియా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20 వరకు చేపట్టిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు సోమవారం పీకేఓసీ2 గనిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్మెంట్ తనిఖీ బృందం పీకేఓసీ2 గనిని సందర్శించి మొదటి, రెండో షిఫ్ట్‌లలో అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మల్టీ డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో పీకేఓసీ2 గనిలో అధికారులు, కార్మికుల సమిష్టికృషితో 91 శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించారని తెలిపారు. రానున్న కాలంలో 100 శాతం లక్ష్యసాధనకు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 96.26 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో పాటు కంపెనీ వార్షిక లక్ష్యమైన 65 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించాలని కోరారు.

**భారీ యంత్రాల వినియోగంపై దృష్టి..**

ఓసీ గనుల్లో ఓబి మట్టి తొలగింపు వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో భారీ యంత్రాల పనిగంటలను పెంచాల్సిన అవసరం ఉందని జీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. షావెల్స్, డంపర్ల నిరుపయోగ సమయాన్ని తగ్గిస్తే ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మణుగూరులో 2.10 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నూతన ఓపెన్‌కాస్ట్ విస్తరణ ప్రాజెక్టును ప్రారంభించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

**కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం..**

సింగరేణి సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై జీఎం దుర్గం రామచందర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రిటైర్డ్ కార్మికుల ఆరోగ్య బీమా పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, మహిళా కార్మికులకు 730 రోజుల చైల్డ్ కేర్ లీవ్, మృతిచెందిన లేదా మెడికల్ ఇన్వాలిడేషన్ పొందిన కార్మికుల కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాలు లేదా రూ.25 లక్షల లంప్‌సమ్ సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యాప్తంగా ఇప్పటివరకు 13,055 మంది డిపెండెంట్లకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించగా, మణుగూరు ఏరియాలోనే 474 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఉద్యోగానికి బదులుగా 55 మందికి రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, పెన్షనర్లకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రమాద బీమా, సహజ మరణ బీమా సదుపాయాలు అమల్లో ఉన్నాయని చెప్పారు.

**ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం..**

ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం అనే స్ఫూర్తితో అధికారులు, కార్మికులు సమిష్టిగా పనిచేసి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని జీఎం దుర్గం రామచందర్ సూచించారు.కార్యక్రమంలో ఏసీ టు జీఎం బి. శ్రీనివాస చారి, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, పీకేఓసీ ప్రాజెక్టు అధికారి ఎం. శ్రీరమేశ్, ఏజీఎం ఐఈడీ సిహెచ్. రాంబాబు, ఏజీఎం పర్సనల్ ఎస్. రమేశ్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరభద్రుడు, ప్రాజెక్టు మేనేజర్ సౌరభ్ సుమన్, ఓసీ2 మేనేజర్ సురేశ్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ తదితర అధికారులు పాల్గొన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, ప్రతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి వి. మధన్ నాయక్, ఓసీ 2 సంక్షేమ అధికారి వంశీకృష్ణతో పాటు మొదటి, నైట్, రెండో షిఫ్ట్‌ల ఉద్యోగులు హాజరయ్యారు.



## క్రీడా వారోత్సవాలు ప్రారంభం

**నేలకొండపల్లి, మహా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం క్రీడా వారోత్సవాలను ప్రారంభించారు. సోమవారం నుంచి ఈ నెల 23 వ తేదీ వరకు వారం రోజులు పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థులు క్రీడల సంస్కృతి, నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ దేశభక్తి పెంపొందించటం లాంటి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందులో భాగంగానే నేలకొండపల్లి లో 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సిహెచ్ శివ. వివిధ పార్టీల నాయకులు జెర్రిపోతులు అంజిని. దోసపాటి శేఖర్, జెర్రిపోతుల సత్యనారాయణ, గుండా బ్రహ్మం. రాయపూడి రోహిత్, కడియాల నరేష్: వివిధ పంచాయతీల సర్పంచ్లు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# 20న దేశ వ్యాప్త మెడికల్ షాపులు బంద్



**నేలకొండపల్లి, మహా :** ఈ నెల 20 దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ చేస్తున్నట్లు మెడికల్ షాపు అసోసియేషన్ ప్రతినిధులు పసుపులేటి ఉపేందర్ పేర్కొన్నారు.మండల కేంద్రంలో మెడికల్ షాపు బంద్ విషయం పై స్థానిక తహాశీల్దార్, ఎస్సై లకు వినతి పత్రం ను అందించారు. అనంతరం కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.....కార్పోరేట్ సంస్థల దోపిడి ధరల విధానంను స్థిరపడిన ఔషధ పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మసీ రక్షణ కోసం, ప్రజాఆరోగ్య పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫార్మసీ ఆక్రమ కార్యకలపాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద కంపెనీల అన్యాయ ధరల విధానం నిలిపివేయాలని కోరారు. చిన్న తరహా, మరియు పెద్ద తరహా కెమిస్ట్ల మనగడుకు కాకుండా ప్రజారోగ్యం పై కూడ తీవ్ర ప్రమాదాల ను కలిగిస్తున్నాయని అన్నారు. పలు డిమాండ్ల 'సాధన కోసం మెడికల్ షాపు యాజమానులు దుకాణాల బంద్ ను చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపులు ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు. సురేష్, జగదీష్, ఫరీద్బాబా, ఉదయ్, సాయిబాబా, వి.నారాయణరావు, రాంప్రసాద్, కైలాసపు గోపి తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సిపిఎం నిరసన

**జూలూరుపాడు, మహా:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ, సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలపై భారాలు మోపడం ఆనవాయితీ అని, దేశంలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగి వెంటనే దేశ ప్రజలపై భారం మోపుతూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం జరిగిందని అన్నారు. ధరలు పెంచడం వల్ల పరోక్షంగా ఇది సామాన్య మధ తరగతి కుటుంబాలపై, రైతాంగం పై భారం పడుతుందని అన్నారు. అదేవిధంగా వ్యవసాయం, నిత్యవసర వస్తువులు ధరలు పెరిగే అవకాశం ఉందని కానీ ఇవేమీ ఆలోచించకుండా సామాన్య ప్రజలపై అధిక భారం పడే విధంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచిందని దీనిని నిరసిస్తూ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వలమల్ల చంద్రరావు, గార్లపాటి వెంకటి, పదం సుగుణ, పేరుమాల్ల వెంకటేశ్వర్లు, జరుకుల మల్లయ్య, బొల్లి లక్ష్మయ్య, బోడ అభిమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో రికార్డు స్థాయి ఎండలు..

- **ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి..**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **మధ్యాహ్నం బయటకు రావొద్దు.. నీరు ఎక్కువగా తాగాలి**
- **చిన్నారులు, వృద్ధులు, గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం**



**మణుగూరు, మహా :** రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా పినపాక నియోజకవర్గ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి గరిష్టంగా 47 నుండి 48 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దప్పిక లేకపోయినా తరచూ నీళ్లు తాగాలని, బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా నీటి సీసా వెంట తీసుకెళ్లాలని సూచించారు. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, పలుచని మజ్జిగ, గ్లూకోజ్ నీరు వంటి ద్రవాహారాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ సమస్యను నివారించవచ్చన్నారు.ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తెలుపు లేదా లేత రంగు నూలు దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, రుమాలు కట్టుకోవడం లేదా గొడుగు వినియోగించడం మంచిదని తెలిపారు. చంటి పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ఎండలో నిలిపి ఉంచిన వాహనాల్లో చిన్నారులు లేదా వృద్ధులను కూర్చోబెట్టడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వేసవిలో నిల్వ ఆహారం త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున అలాంటి పదార్థాలను తినకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అధికంగా టీ, కాఫీలు సేవించడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు.

**విద్యార్థులు, క్రీడాకారులకు సూచనలు..**

చిన్నారులు, విద్యార్థులు ఉదయం 10 గంటలలోపు ఆటలు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. క్రీడాకారులు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే సాధన కోసం మైదానాలకు వెళ్లాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య చికిత్స పొందాలని సూచించారు. తలనొప్పి, తల తిరగడం, అధిక జ్వరం, చర్మం పొడిబారడం, వాంతులు, అపస్మారక స్థితి వంటి లక్షణాలు వడదెబ్బకు సంకేతాలని ఎమ్మెల్యే వివరించారు. బాధితులను వెంటనే నీడ ఉన్న చల్లని ప్రదేశానికి తరలించి సాధారణ నీటితో శరీరాన్ని చల్లబరచాలని తెలిపారు. పరిస్థితి అదుపులోకి రాకపోతే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే మొదటి ప్రాధాన్యత. ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.



## రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటిన ముగ్గురు దివ్యాంగులు

**నేలకొండపల్లి, మహా:** ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా దివ్యాంగులకు యువజన క్రీడాత్సవాల గురించి రాష్ట్ర స్థాయి పోటీలలో నేలకొండపల్లి మండలం కు చెందిన ముగ్గురు సత్తా చాటారు. డి.ప్రసన్నకుమార్(అమ్మగూడెం) రాష్ట్ర స్థాయిలో రెండు బహుమతులు సాధించారు. రూ.10 వేల నగదు ను అందుకున్నారు. దంతాల నిహారిక షాట్ పుట్ 'లో, వాసంశెట్టి చరణ్ తేజ చెస్ లో రాష్ట్ర స్థాయిలో విజయం సాధించారు. సోమవారం మండల కేంద్రంలో ముగ్గురు విజేతలను మండల స్థాయి అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు...దివ్యాంగులు అన్ని రంగాలలో ప్రతిభ చూపాలని సూచించారు. రాష్ట్ర స్థాయి లో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో మండల ప్రతిభ ను నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాం ప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యా శాఖాధికారి బీ.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు

# దమ్మపేట ఎస్సైగా రాజేష్ కుమార్



**దమ్మపేట ,మహా :** దమ్మపేట పోలీసు యసై గా బి.రాజేష్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ యసై గా విధులు నిర్వహించిన సాయికిషోర్ రెడ్డిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. కాగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రాజ్ కుమార్ గతంలో చంద్రుగుండ మండలంలో యస్ ఐ గా విధులు నిర్వహించారు. తాజాగా వరంగల్ కమీషనరేట్ నుండి దమ్మపేట కు నియామకం కాబడ్డారు. ఇక్కడ పనిచేసిన సాయికిషోర్ రెడ్డిని కొత్తగూడెం యస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

# జిల్లాలో ఘనంగా వాక్‌థాన్, కార్యక్రమం




- **ప్రారంభించిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందాలి**

**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా యువజన క్రీడలవారోత్సవాలలో భాగంగా మొదటి రోజున సోమవారం వరంగల్ నగరంలో వాక్‌థాన్, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు.కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ వాక్‌థాన్ ఐడీఓసీ వరకు కొనసాగింది. అనంతరం మానవహారం నిర్వహించి అవేర్నెస్ కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనేది అక్షరాల సత్యం అని ప్రతి ఒక్కరు ఒత్తిడిని నివారించుటకు వ్యాయామం మార్నింగ్ వాక్ తప్పనిసరి అని వారు పేర్కొన్నారు.జిల్లా పరిషత్ సీఈవో రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పని సరిగా వ్యయం మార్నింగ్ వాక్ చేయాలని వారు పేర్కొన్నారు .ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, యువజన, క్రీడల వారోత్సవాల నోడల్ అధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం 18 నుండి 23 వరకు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసివో నీరజ, డిబిసిడిఓ పుష్పలత, యూత్ స్పోర్ట్ అధికారి అనిల్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, డి పి ఆర్ ఓ ప్రేమలత, ఫిషరీస్ శ్రీపతి, డి ఎం డబ్ల్యు ఓ డి రమేశ్, సంబంధిత శాఖల అధికారులు పలు విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా 2కే రన్..

**జెండా ఊపి ప్రారంభించిన సర్పంచ్ మాధవరావు**

**మణుగూరు, మహా :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమితి సింగారం గ్రామంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ రన్‌ను సమితి సింగారం సర్పంచ్ మాధవరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాహశీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ లు పాల్గొని ప్రజా పాలన కార్యక్రమాల లక్ష్యాలను వివరించారు. యువత, విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. 2కే రన్ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాటు గ్రామ ప్రముఖులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నామమాత్రంగా టుకే రన్

**టోపీలు కొరత.. పూర్తిగా విఫలమైన అధికార యంత్రాంగం**



**దమ్మపేట ,మహా :** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ,ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ,దమ్మపేట అధికారులు నిర్వహించిన ఫిట్ అండ్ యాక్టివ్ ప్రోగ్రాం పూర్తిగా విఫలమైంది. సోమవారం ఉదయం 7గంలకు స్థానిక అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ చే గౌరవంగా ప్రారంభించబడిన టుకే రన్ నిర్వహణలో మండల స్థాయి అధికారులు అలసత్వం ప్రదర్శించారు. కేవలం నామమాత్రంగా ,చిత్తశుద్ధి మరిచి కార్యక్రమం నిర్వహించారనే విమర్శలు సర్వత్రా వినిపించాయి. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ నుండి ప్రారంభం కాబడిన కార్యక్రమం రెండు కిలోమీటర్ల మేరకు మందలపల్లి వరకు టు కే రన్ నిర్వహించాల్సి ఉంది. కానీ అలా చేయకుండా కేవలం 20 మీటర్ల దూరం మాత్రమే రన్ చేసి ఫోటోలకు ఫోజులు ఇవ్వడంతో కార్యక్రమం ముగించారు. ఆరోగ్యం అందరి బాధ్యత ,అందుకోసం యువత ఫిట్నెస్ పెంపొందించుకోవాలి ,క్రీడలు అందుకు దోహదపడతాయనే సందేశాత్మక సందేశం ఇవ్వడంతో కేవలం అర్ధగంట వ్యవధిలో నే ముగింపు పలికారు. దమ్మపేట పట్టణం నుండి మందలపల్లి వరకు రోడ్డుపై ఇరువైపులా వేసిన తెల్లని సున్నం వేసినంత సేపుకూడా కార్యక్రమం నిర్వహించలేదంటే వాస్తవంగా అధికారులు పనిచేస్తున్నట్లా...?? లేక నామ మాత్రం గానే చేస్తున్నారా....? అడిగేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో అధికారులు తమ ఇష్టానుసారంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటుగా గోచరిస్తుంది. ప్రభుత్వ పనితీరంటేనే అధికారులు.... అటువంటి అధికారులు నిర్లక్ష్యంగా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వీర్యం చేస్తుంటే స్థానికంగా ఉన్న ప్రజా నాయకులు ఏం చేస్తున్నారంటూ కొందరూ ఆరోగ్య అభిలాషులు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమానికి సర్పంచ్ లు ,ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆహ్వానించినప్పటికీ తక్కువ సంఖ్యలో మాత్రమే హాజరవడం ,అరకొర వచ్చిన వారందరికీ కూడా ప్రజాపాలన తెల్లటోపీలు సరఫరా చేయలేక పోవడం పై విమర్శలు వస్తున్నాయి. అంతగా ఏర్పాట్లు చేయలేనప్పుడు ఆర్భాటాలు చేస్తూ అందరినీ ఆహ్వానితులను చేయడం ఎందుకని ప్రతిపక్ష పార్టీల నాయకులు కొందరు బహిరంగ విమర్శలు చేశారు. ఏది ఏమైనప్పటికీ ఎమ్మెల్యే కి నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమం ఉన్నందున ప్రారంభించి వెళడం అనేది సహజం. అటు తర్వాత పూర్తిస్థాయిలో చేయాల్సిన కార్యక్రమం అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది కదా అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి లేని కార్యక్రమాలతో అధికారులు చేసే కాలయాపన పనులను సరిచేసుకోపోతే దాని పర్యవసనాలు ప్రజాప్రతినిధుల పైన ,పాలకుల పైన ,అధికార రాజకీయ పార్టీ పైన ప్రభావం పడకతప్పదని గుర్తుంచుకోవాలని ప్రతిపక్ష నేతలు నొసలు చిట్లిస్తున్నారు.



## ఆరోగ్యమే మహాభాగ్యం..

**బూర్గంపహాడ్‌లో ఉత్సాహంగా 2కె రన్**
**తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహణ**

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన 2 కిలోమీటర్ల రన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య చైతన్యాన్ని చాటిచెప్పారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక ఎంపీడీఓ జమలారెడ్డి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం పాల్గొన్నవారంతా 2 కిలోమీటర్ల దూరం ఉత్సాహంగా పరుగెత్తి ఫిట్‌నెస్‌పై తమ నిబద్ధతను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ జమలారెడ్డి మాట్లాడుతూ యువతతో పాటు ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం ఒకటి లేదా రెండు కిలోమీటర్లు పరుగెత్తడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యకర జీవనశైలి, ఫిజికల్ లిటరసీపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.రన్ అనంతరం స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్ పాల్గొన్న వారికి శారీరక వ్యాయామం, ఫిట్‌నెస్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ఎంపీడీఓ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ యువత, ఉపాధ్యాయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలపై వెంటనే స్పందించండి

- వాటికి శాశ్వత పరిష్కారం చూపండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**మహా వరంగల్ బ్యూరో;** ఆయా ఫిర్యాదుల పై పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితుల సమస్యల పై వెంటనే స్పందించి వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదులు (గ్రీవెన్స్) కార్యక్రమంలో కమిషనరేట్ నలుమూలల నుండి ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్ కు స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 10 ఫిర్యాదులను సేకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# నగరంలో ట్రాఫిక్ పోలీసు వారి స్పెషల్ డ్రైవ్

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ 81 మందుబాబులు

**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ పట్టణం లోని కాజీపేట, హనుమకొండ వరంగల్ ట్రాఫిక్ పిఎస్ ల పరిధులలో తేదీ 17 05 2026 ను స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా మొత్తం 81 ఎనభై ఒకటి డ్రంక్ అండ్ డ్రైవ్ తో పాటు ఆరుగురు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి పై కేసులు నమోదు చేయగా, అందులో 75 మందికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో ఏసీపీ ట్రాఫిక్ వరంగల్ టి సత్యనారాయణ తో పాటు కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల. వెంకన్న వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారిని సంభందిత మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, సంభందిత మేజిస్ట్రేట్ ఎనభై తొమ్మిది మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వ్యక్తులకు రూ. 112 300 లు, (17) పదిహేడు మంది డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి రూ.10 800 లు ఫైన్ లు విధించారు.



ట్రాఫిక్ పోలీసు వారి హెచ్చరిక

వరంగల్ మహా నగరంలో ఇకపై ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నిడిపిన, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా తమ వాహనాలు నడిపినా, మైనర్లు లకు తమ వాహనాలు ఇచ్చిన ఇకపై చట్ట రీత్యా కటినమైన చర్యలు తీసుకుంటామని టి. సత్యనారాయణ ఏసీపీ వరంగల్ ట్రాఫిక్ హెచ్చరించారు.

# బక్రీద్ పండుగను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలి




- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- కలెక్టర్ల తో కలసి అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం

**మహా వరంగల్ బ్యూరో ;** రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా, పరస్పరం గౌరవించుకుంటూ పండుగను సామరస్య వాతావరణం లో నిర్వహించుకునే విధంగా ఇతరులు కూడా సహకరించాలని వరంగల్ సిటీ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఐడీఓసీలో హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహేత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పండుగ సందర్భంగా చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, ఈద్గాల వద్ద సౌకర్యాల ఏర్పాటు పై వారు సమీక్ష నిర్వహించారు.మసీదులు, ప్రార్థనా స్థలాలు, ఈద్గాల పరిసరాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ నగరాల్లో ప్రతి పండుగను ప్రజలు సామరస్యంతో జరుపుకుంటారని, అదే స్ఫూర్తి తో బక్రీద్ పండుగను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి మతానికి సంబంధించిన భావోద్వేగాలను గౌరవించడం పోలీసు శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా పరస్పర సహకారంతో పండుగను నిర్వహించాలని కోరారు.జంతువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఫిట్ నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పశువుల వ్యర్థాలను రోడ్ల పై వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు.

### తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహేత్ బాజ్‌పాయి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బల్దియా ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా బలికి ఉపయోగించే పశువులకు ఫిట్ నెస్ సర్టిఫికెట్లు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. ఎవరైనా మనోభావాలు దెబ్బతినకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు .ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా, డీసీపీలు అంకిత్ కుమార్, ధారా కవిత, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏసీపీలు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, శాంతి కమిటీ అధ్యక్షులు డాక్టర్ అనిస్ సిద్ధిక్వి, సభ్యులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులపై అప్రమత్తత అవసరం

- ముందు జాగ్రత్తే మనకు రక్షణ
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ లో ఉత్కంఠ రేపిన రెడ్ అలెర్ట్ మాక్ డ్రిల్
- ప్రత్యక్ష విపత్తును తలపించిన సహాయక చర్యలు
- సహాయక చర్యలను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్





**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ లో సోమవారం నిర్వహించిన ప్రకృతి విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రజల్లో ఉత్కంఠ రేపింది. నిజంగా వరద విపత్తు సంభవించినట్టే అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు, సాహసోపేత విన్యాసాలు కళ్లకు కట్టినట్లు కనిపించాయి. మధ్య కోట గుండు చెరువు ప్రాంతంలోని యాదవవాడ లో రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది.ఈ ప్రక్రియ అంతా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 వరకు జరిగింది. ఈ కార్యక్రమం వలన ప్రజలలో మంచి అవగాహన కలిగించుటకు ఈ మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగపడిందని ప్రజలకు భరోసా కల్పించడం జరిగింది. ఈ మాక్ డ్రిల్ లోవాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చేపట్టిన మాక్ డ్రిల్ లో పోలీస్, రెవెన్యూ, ఫైర్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, శాఖలతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఎంతో సమన్వయంతో పనిచేశాయి.

ప్రమాద సమయంలో క్షణం ఆలస్యం కూడా ప్రాణ నష్టానికి దారితీస్తుందనే పరిస్థితిని ప్రత్యక్షంగా ప్రజలకు కళ్లకు కట్టినట్టుగా చూపించడం లో పై తెలిపిన శాఖలు ఎంతో కృషి చేశాయి. అంతేకాకుండా ఈ సహాయక చర్యలతో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.వరంగల్ ఏకశిలా పార్కు చెరువులో ఇద్దరు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోతుండగా, మరో ఇద్దరు చెరువు మధ్యలోని బండరాళ్లపై ప్రాణభయంతో సహాయం కోసం అరుస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న వారిని కలచివేశాయి.సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన బోట్లతో చెరువులోకి దూసుకెళ్లి, ఉధృత నీటిని చీల్చుకుంటూ బాధితులను రక్షించాయి. ఈ దృశ్యాలు చూస్తున్న ప్రజలు కాసేపు ఇది మాక్ డ్రిల్ అన్న విషయాన్నే మరిచిపోయారు. అదే సమయంలో వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న గొర్రెలు, ఆవులను కూడా ప్రత్యేక బృందాలు సాహసోపేతంగా రక్షించుటలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల తీరును ప్రజలు అభినందించారు. నీటిలో నుంచి బయటకు తీసిన పశువులను వెంటనే పశువైద్య సిబ్బంది చికిత్స కోసం తరలించారు.రక్షించిన బాధితుల్లో ఒకరు అపస్మారక స్థితిలో ఉన్నట్లు చూపించగా, వైద్య సిబ్బంది అక్కడికక్కడే సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడే విధానాన్ని ప్రదర్శించారు.అనంతరం 108 అంబులెన్స్‌లో బాధితుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించడం ద్వారా అత్యవసర వైద్య సేవల స్పందనను చూపించారు.ప్రమాదం సంభవించినప్పుడు శాఖల మధ్య సమన్వయం, ప్రజల తరలింపు, సహాయక చర్యలు ఎలా ఉండాలనే అంశాలను ఈ మాక్ డ్రిల్ ను ప్రజలు స్పష్టంగా గమనించారు. వరద బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన ప్యాకెట్లు తాగునీటిని అందించారు. కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల పై ప్రజలకు అప్రమత్తత అవసరమని ముందు జాగ్రత్తే మనకు రక్షణ కవచమని ఇలాంటి విపత్తుల సమయంలో ప్రతి నిమిషం కీలకమని, అధికారులు సమన్వయంతో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మాక్ డ్రిల్ స్థానిక ప్రజలు, విద్యార్థులు, అధికారులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రత్యక్ష విపత్తు జరిగినట్టే కనిపించిన ఈ విన్యాసాలు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయం పై స్పష్టత కల్పించాయి.అరెల్ల బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారి మౌలిక సదుపాయాలు ఆరోగ్య క్యాంప్ లు ఏర్పాటు చేసిన తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావుతో, అగ్నిమాపక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండలో అబ్బురపరిచిన మాక్ ఎక్సర్సైజ్

- ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన అవసరం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- సహాయక చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్



**మహా వరంగల్ బ్యూరో;** హనుమకొండ నగరంలోని వరద ముంపు ప్రభావిత కాలనీలలో సోమవారం చేపట్టిన మాక్ ఎక్సర్సైజ్ ( డ్రిల్ )ను వివిధ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు రెస్క్యూ బృందాలు, వివిధ శాఖల అధికారులు చేపట్టే సహాయక చర్యల పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈ మాక్ ఎక్సర్సైజ్ సాగింది. ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాక్ ఎక్సర్సైజ్ హనుమకొండలోని ఏడు చోట్ల ఏకకాలంలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్ డి ఆర్ ఎఫ్), అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పోలీస్,మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు నిర్వహించారు. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు హనుమకొండ స్నేహ నగర్ లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన స్టేజింగ్ వద్ద నుండి ఎస్ డి ఆర్ ఎఫ్, డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగా ఆయా కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఎన్ డిఎంఏ మార్గదర్శకాల ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో మాక్ ఎక్సర్సైజ్ ను విజయవంతంగా నిర్వహించారు.

**ఏడు ప్రాంతాల్లో సహాయక చర్యలు**

ముందుగా వరద ప్రభావిత ప్రాంతమైన టీఎన్జీవోస్ కాలనీ ఫేజ్ 2 కాలనీలో ఎమర్జెన్సీ సైరన్ ను మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ, ఇతర శాఖల అధికారులు సహాయక చర్యలను చేపట్టారు. ముంపునకు గురైన ఆ కాలనీ ప్రజలను ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి రవి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి, ఆధ్వర్యంలో రెస్క్యూ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రం (రిలీఫ్ క్యాంప్ )నకు తరలించారు. అదేవిధంగా వివేక్ నగర్ లో వరద ముంపునకు గురైన పలువురు కాలనీవాసులు మూడంతస్తుల బిల్డింగ్ పై ఉండగా డ్రోన్ల ద్వారా ఆహార ప్యాకెట్లను అందించిన అనంతరం రెస్క్యూ బృందాలు తాళ్ల సహాయంతో కిందకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి తరలించారు. సమ్మయ్య నగర్ లోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న వరద ముంపు కాలనీ ప్రజలను తాళ్ల సహాయంతో రెస్క్యూ బృందాలు స్థానికులను కాపాడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పునరావాస కేంద్రానికి తరలించారు. స్ట్రెచర్ పై వరద ముంపునకు గురైన ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు ప్రజలను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. వరద ముంపునకు గురైన కాలనీల ప్రజలకు ధైర్యం చెబుతూ ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. ఈ మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగా టీఎన్జీవోస్ కాలనీ పేజ్ 2, వివేక్ నగర్, సమ్మయ్య నగర్, ప్రగతి నగర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీలలో సహాయక చర్యలు కొనసాగాయి. రోగులను, బాధితులను లష్కర్ సింగారంలోని యు పి హెచ్ సి కి వైద్య సేవలను నిమిత్తం తరలించి చికిత్స అందించారు. 108 అంబులెన్స్లు, ఎస్డిఆర్ఎఫ్ వాహనాలు, అగ్నిమాపక వాహనాలను సహాయక చర్యలలో భాగంగా రంగంలోకి దిగాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాటుచేసిన స్టేజింగ్ వద్ద లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచారు. వరద ముంపునకు గురైన కాలనీల్లో ఎస్ డి ఆర్ ఎఫ్, డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు, అధికారులు చేపట్టిన సహాయక చర్యలను, ఆరోగ్య కేంద్రం, పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లను న్యూఢిల్లీ నుండి విపత్తుల నిర్వహణ సంస్థ కన్సల్టెంట్ , రిటైర్డ్ మేజర్ జనరల్ సుధీర్ బాహల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారు. అక్కడినుండి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. సహాయక చర్యల గురించి పలు సలహాలు, సూచనలు చేశారు. వరద ముంపునకు గురైన కాలనీల ప్రజలను సురక్షితంగా బయటికి తరలించేందుకు ఎస్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు వేగంగా ప్రతిస్పందించారు. సహాయక చర్యలను చేపట్టి ఆయా కాలనీల ప్రజలను కాపాడారు.

**పునరావాస కేంద్రం ఏర్పాటు**

స్నేహ నగర్ లోని ఎస్వీ కన్వెన్షన్ హాలులో పునరావాస కేంద్రం రిలీఫ్ క్యాంపు ను అధికారులు ఏర్పాటు చేశారు. మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగా వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎన్డిఆర్ఎఫ్, డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల బృందాలు సురక్షితంగా కాపాడి వాహనాల్లో పునరావాస కేంద్రానికి తరలించారు. పునరావాస కేంద్రంలో డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలను అందించారు. బాధితుల కోసం బెడ్లను ఏర్పాటు చేసి బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. అల్పాహారం, భోజన సౌకర్యాలను కల్పించారు.

# గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

## గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్

**మహా:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం జాన్పాక గ్రామానికి చెందిన బాదావత్ విజయ్ కుమార్, తండ్రి పేరు రవి, వయస్సు 22 సంవత్సరాలు, కులం లంబాడా, వృత్తి కూలీ అనే వ్యక్తి జాన్పాక గ్రామంలో తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు గీసుగొండ పోలీసులు దాడి నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 5 లీటర్ల ప్రభుత్వ నిషేధిత గుడుంబా లభించగా, పంచుల సమక్షంలో గుడుంబాను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను ప్రజలు సేవించడం వల్ల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఎవరైనా ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేసినా, నిల్వ ఉంచినా లేదా విక్రయించినా, వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# పిర్యాదు ఉపసంహరణ చేసుకున్న మండల నాయకుడు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం లో డబ్బుల వివాదంలో మండల నాయకుడి పై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు ఫిర్యాదును ఉపసంహరించు కున్నారని సీఐ డి విశ్వేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.డబ్బుల లావాదేవీల విషయంలో ఏర్పడిన వివాదం కారణంగా ఓ మండల నాయకుడి పై దాడి జరిగిన ఘటన గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, డబ్బుల వ్యవహారంలో ఏర్పడిన వివాదం తీవ్రరూపం దాల్చడంతో కొందరు వ్యక్తులు మండల నాయకుడి పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితుడు గాయపడగా, అనంతరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కాగా ఫిర్యాదుదారుడు తన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు తగిన న్యాయం చేస్తారనే నమ్మకంతో తన ఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నట్లు పోలీసులకు లిఖితపూర్వకంగా దరఖాస్తును సమర్పించారు.దీంతో ఫిర్యాదుదారుడి వినతి మేరకు సంబంధిత పిటిషన్ పై తదుపరి చర్యలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గీసుగొండ సీఐ తెలిపారు.

# ఈవో పై అర్చకుడి దాడి కథనానికి స్పందించిన దేవాదాయ శాఖ

## అర్చకుడి బాబాయ్ పై తాత్కాలిక వేటు

## మహా పత్రిక ఎఫెక్ట్

**మహా వరంగల్ బ్యూరో;** తేదీ 24 5 2026 ఆదివారం వివాదాల్లో వరంగల్ దుర్గేశ్వర స్వామి ఆలయం.. ఈవో పై అర్చకుడి బాబాయ్ దాడి అనే కథనం మహా పత్రికలో ప్రచురితమైంది. ఈ కథనంతో కదిలిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ అర్చకులు నిఖిల్ శర్మ బాబాయ్ ఫణి శర్మ పై తాత్కాలిక వేటు వేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు అర్చకులు ఫణి శర్మ వరంగల్ దుర్గేశ్వర స్వామి ఆలయం లోకి వెళ్లడం గాని స్వామివారి నిత్య కైంకర్యాల లో పాల్గొనవద్దని సోమవారం దేవాదాయ శాఖ వరంగల్ డిసి రామల సునీత ఆదేశించినట్లు తెలిసింది.



# జనగణనలో సమగ్ర వివరాలను నమోదు చేయాలి

- ప్రతి కుటుంబ వాస్తవ వివరాలను నమోదు చేయాలి
- రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి




**మహా వరంగల్ బ్యూరో;** జనగణనలో ప్రతి కుటుంబం యొక్క సమగ్ర వివరాలు , కుటుంబ వాస్తవ పరిస్థితులను ఎన్యుమరేటర్లు నమోదు చేసే విధంగా చేయాలని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి అధికారులకు సూచించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్ జిల్లాలో చేపట్టిన జనగణన పురోగతిపై జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద,చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్లు ఎన్.రవి, వై.వి. గణేష్, సంధ్యారాణి, డిఆర్ఓలు, ఆర్డీవోలు, తహసిల్దార్లు , ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ వరంగల్ జిల్లాలకు సంబంధించి మండలాల వారిగా జనగణనకు సంబంధించిన పురోగతిని చార్జ్ అధికారులుగా ఉన్న తహసిల్దార్ల ను రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు జనగణన పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామం, మండలం, మున్సిపాలిటీ, పట్టణాల్లో ప్రభుత్వ పాలసీలు, అభివృద్ధి పథకాలు రావాలంటే జనగణన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం వివరాలు ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. జనగణన ప్రతి 10 సంవత్సరాలకు పెద్ద ఎత్తున చేస్తుంటారని, ఒక్కసారి చేసే జనగణన 10 సంవత్సరాలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాలసీలు జనగణన పైనే ఆధారపడి ఉంటాయని అన్నారు. పది సంవత్సరాలకు ఉపయోగపడే జనగణన 5060 ఏళ్ల పాటు ప్రభావం చూపిస్తుందన్నారు. కాబట్టి జన గణన కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకొని ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయాలన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా జనగణనను పూర్తి చేయాలన్నారు.జనగణన ప్రాముఖ్యతను అధికారులు పరిగణనలోకి తీసుకొని డేటాను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వాలు ఏ పాలసీ తీసుకురావాలన్నా జనగణన డేటా అనేది ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఎలాంటి డీలిమిటేషన్ జరగాలన్నా, రిజర్వేషన్లు కావాలన్నా జనగణన డేటా అనేది చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాష్ట్ర, దేశ అభివృద్ధికి తప్పనిసరిగా జన గణన డేటా అవసరమన్నారు. జనగణన ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నది కాబట్టి అధికారులు జన గణన చేపట్టేటప్పుడు సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. 16 సంవత్సరాల తర్వాత చేపడుతున్న జనగణన కాబట్టి గ్రామాలు, పట్టణాల్లో జనాభాతో పాటు నివాస గృహాల సంఖ్య పెరిగిందని, చాలా మార్పులు వచ్చాయన్నారు. సెన్సెస్ ను మదర్ ఆఫ్ ఆల్ సర్వేస్ అంటారని పేర్కొన్నారు. జనగణనలో సమగ్ర వివరాలు నమోదు చేయబడతాయన్నారు. జనగణనలో డేటా నమోదు అద్దంలా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో నిజమైన పరిస్థితులను, వాస్తవ సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ప్రజల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకే జనగణన అని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, మౌలిక వసతులు, తదితర వివరాలు జనగణనలలో నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటి వివరాలను తప్పనిసరిగా జనగణనలో నమోదు చేయాలన్నారు. జనగణన చేపట్టే ప్రాంతంలో వంద శాతం డేటాను సేకరించాలని సూచించారు. వాస్తవ డేటా నమోదు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. జూన్ 19 ఆఖరి గడువు అని పేర్కొన్నారు. ఫేజ్ 1, ఫేజ్ 2లో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు డేటా కలెక్ట్ చేస్తారని అన్నారు. బ్లాక్ ల వారీగా డేటా నమోదుకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలియజేశారు.హెచ్ ఎల్ బి (హౌస్ లిస్టింగ్ బ్లాక్) ల వారిగా జనగణన కోసం ఇప్పటికే మెటీరియల్ అందజేయడం జరిగిందన్నారు. అధికారులకు విధినిర్వహణలో ఎన్ని పనులు ఉన్నా జనగణన సమర్థవంతంగా జరిగే విధంగా చూడాలన్నారు. జనగణన డేటా సేకరణ గతంలో మాన్యువల్ గా చేసేవారని, నేడు నూతన టెక్నాలజీని అనుసరించి ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేయడం ద్వారా ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. హెచ్ ఎల్ బి మానిటరింగ్ అనేది ఎంతో ముఖ్యమన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. జనగణనలో పాల్గొనే ఎన్యుమరేటర్లకు అత్యవసరంగా వైద్య కారణాల వల్ల సెలవులో వెళితే వారి స్థానంలో రిజర్వ్ లో ఉన్న వారిని కేటాయించాలన్నారు. రిజర్వ్ లో ఉన్న ఎన్యుమరేటర్లకు కూడా జన గణనకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కంటే అర్బన్ ప్రాంతంలో జనగణన చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఏ ఒక్కటి మిస్ కాకుండా ప్రతి ఇంటి వివరాలు నమోదు చేయాలన్నారు.జనగణన ఎంతో ప్రాముఖ్యత ఉన్నది కాబట్టి వేగవంతం చేయాలన్నారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్ ల వారీగా చార్జ్ అధికారులు (తహసిల్దార్లు ) పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు క్వాలిటీ డేటాను నమోదు చేయాలన్నారు. హెచ్ఎల్బి ల వారీగా సేకరించిన డేటాను చార్జ్ అధికారులు పరిశీలించాలన్నారు. పోర్టల్ లో నమోదు చేసిన వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది మానిటరింగ్ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న జనగణన అని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న తొలి జనగణనలో పాల్గొంటున్నామని, కాబట్టి డేటా సమగ్రంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో చేపట్టిన జనగణన ప్రక్రియ, ఎన్యుమరేటర్ల సంఖ్య, జనగణన పురోగతి పై వివరించారు.జనగణన నిర్దేశిత గడువులో హౌస్ టు హౌస్ విసిట్ చేసి డేటా వేగవంతంగా సేకరించే విధంగా ముమ్మర చర్యలు తీసుకుంటామని అన్నారు..ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో 14 మండలాలు ఉన్నాయని, ఇందులో 2 మండలాలు పూర్తిగా అర్బన్ ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. ఎన్యుమారేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. జన గణనకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు.



# ఆఫర్స్ కోసం ఎదురు చూస్తున్న రాధికా ..

అందాల భామ నేహా శెట్టి క్రేజ్ పెంచేసింది ఒకే ఒక్క సినిమా అది డీజే టిల్లు. మెహబూబా సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి నటించిన మోహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది.ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. కానీ నేహాకు తెలుగులో అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత సిద్ధు జొన్నలగడ్డ సరసన డీజే టిల్లు సినిమాతో హిట్టుకొట్టింది. ఇందులో ఆమె నటించిన రాధిక పాత్ర యూత్ లో ఎంతగా వైరల్ అయ్యిందో చెప్పక్కర్లేదు. ఆ తర్వాత తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటించింది. దీంతో మెల్లగా ఇండస్ట్రీలో ఆఫర్స్ తగ్గిపోయాయి. చాలా కాలంగా నేహా శెట్టి ఒక్క సినిమా కూడా చేయలేదు.కానీ ఇటీవలే పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసింది. కానీ ఈ అమ్మడు బ్యాడ్ లక్ అక్కడ సైతం వెంటపడింది. ప్రస్తుతం తెలుగులో సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. అలాగే సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తుంది.



# కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్న గ్లామరస్ క్వీన్ దివ్య భారతి

చేసింది ఒకే ఒక్క సినిమా అది కూడా తమిళ్ లో.. జీవి ప్రకాష్ హీరోగా నటించిన బ్యాచ్ లర్ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది దివ్య భారతి. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. ఆమె అందానికి, వయ్యారాలు కుర్రాళ్ళు ఫిదా అయిపోయారు.ఈ సినిమాలో ఓ సాంగ్ తెగ పాపులర్ అయ్యింది. ఆ సాంగ్ లో లిప్ లాక్స్ లో రెచ్చిపోయింది దివ్య భారతి. ఆతర్వాత మరోసారి జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తోంది.తెలుగులో సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న సినిమాలో దివ్య భారతి హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇక సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోందిసోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ ఓ రేంజ్ లో రెచ్చిపోతుంది. కుర్రకారు ఈ అమ్మడి ఫోటోలకు ఫిదా అవుతున్నారు.



## హిట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న

# అందాల ఆషిక రంగనాథ్

2023లో నందమూరి కళ్యాణ్ రామ్ సరసన 'అమిగోస్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఆషిక రంగనాథ్. ఈ సినిమా ఫ్లాప్ అయినా.. ఇందులో "ఎన్నో రాత్రులొస్తాయి గానీ..." రీమిక్స్ పాటలో ఆమె డాన్స్ , లుక్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆతర్వాత కింగ్ అక్కినేని నాగార్జున సరసన నా సామి రంగ లో చేసింది .ఈ సినిమాలో ఆమె నటనకు, నాగార్జునతో కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి.నా సామి రంగలో 'వరాలు' అనే సాంప్రదాయబద్ధమైన పాత్రలో నటించి, తెలుగులో మంచి బ్రేక్ అందుకున్నారు. ఇక ఈ మధ్య రవితేజ హీరోగా నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ప్రస్తుతం ఈ అమ్మడు ఆశలన్నీ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా పైనే పెట్టుకుంది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. కాగా నెట్టింట యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తన గ్లామరస్ ఫొటోలతో కుర్రకారును కట్టిపడేస్తుంది. ఓ రేంజ్ లో వయ్యారాలు ఒలకబోస్తుంది ఈ అమ్మడు.



## క్యూట్ బ్యూటీ

# సాన్వి మేఘన

2019లో వచ్చిన 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్' సినిమాతో కెరీర్ ప్రారంభించింది అందాల భామ సాన్వి మేఘన అదే ఏడాది 'సైరా నరసింహారెడ్డి' లోనూ ఒక చిన్న పాత్రలో కనిపించారు. చేసింది చిన్న పాత్రే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వచ్చిన నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ ఆంథాలజీ మూవీ 'పిట్ట కథలు' ఈ అమ్మడి నటనకు విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి.ఆ తర్వాత 'పుష్పక విమానం' లో సినిమాలు నటిగా తెలంగాణ యాసతో మాట్లాడుతూ ప్రేక్షకులను అలరించింది ఈ భామ. 'ప్రేమ విమానం' (2023), 'టుక్ టుక్' (2025) వంటి సినిమాల్లో కూడా కీలక పాత్రలు పోషించింది. 2025లో వచ్చిన 'కుడుంబస్థన్' సినిమాతో తమిళ్ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టింది ఈ అందాల తార. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది.. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com